


# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

Voice of the leader

FIRST TELUGU MULTIMEDIA E-PAPER




జగన్‌కు మరో ఝలక్! జోగయ్య పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు నోటీసులు
3

నేడు టీడీపీ, జనసేన జేఏసీ సమావేశం
2

4



## ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబుకు
# ముందస్తు బెయిల్‌పై నేడు విచారణ

### 17ఏ వర్తింపు తీర్పుపై అనిశ్చితి

- మిగతా 2లో..

# చెట్టు ఫొటోతో ఓటు!

### అపహాస్యంగా ఓటర్ల జాబితాల ప్రక్రియ: అచ్చెన్నాయుడు

- వైసీపీకి అంతిమ ఘడియలు
- ప్రజాగ్రహాన్ని పసిగట్టే ఓటర్ల జాబితాల్లో జగన్‌రెడ్డి అక్రమాలు
- ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాలను కలెక్టర్లు, కిందిస్థాయి అధికారులు ఖాతరు చేయడం లేదు
- ప్రతిపక్షాలు.. ప్రజల విజ్ఞప్తుల్ని కూడా బుట్టదాఖలు చేస్తున్నారు
- తప్పులు చేస్తున్న సిబ్బంది, వాలంటీర్లు, సచివాలయ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- రాష్ట్రంలోని పరిస్థితుల్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తాం



4

## ఓటరు జాబితా అవకతవకలపై..
# జాతీయస్థాయి పోరాటం

- నియోజకవర్గాల వారీగా టీడీపీ-జనసేన ఆత్మీయ సమావేశాలు
- జగన్ సర్కారు దోపిడీ, ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో ఉమ్మడి పోరాటం
- వైసీపీ పాలనలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై రౌండ్ టేబుల్ సమావేశాలు
- జగన్ పాలనలో ఎస్సీ, మైనార్టీలకు జరిగిన సామాజిక అన్యాయాన్ని ఎండగట్టడం
- టీడీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశంలో నిర్ణయాలు

5



## సంక్షేమం పేరుతో వంచన
## జగన్‌కు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుల బహిరంగ లేఖ

జగన్‌రెడ్డి ది మోసకారి సంక్షేమమని పలువురు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు అన్నారు. తెలుగు దేశం ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారు సొంత కాళ్లపై నిలబడేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం వారి కాళ్లు విరిచి.. కట్టు కట్టి గొప్ప సాయం చేసినట్లుగా ప్రచారం చేసుకుంటోం దన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు పది ప్రశ్నలు సంధిస్తూ బహిరంగ లేఖ రాశారు.

2

జగన్, సజ్జల అబద్ధాల్లో
## అందరికంటే ఘనులు

రాష్ట్రానికి మరలా జగన్ ఎందుకు అవసరమని మండిపడ్డ దేవినేని

- కరువు కాటేస్తుంటే సొంత డబ్బా కొట్టుకుంటున్న సీఎం, మంత్రులు
- ఇసుక కుంభకోణంలో జగన్ రెడ్డి, సజ్జల, పెద్దిరెడ్డి జైలుకెళ్లడం ఖాయం.
- జగన్ అసమర్థత వల్లే కృష్ణా జలాల పునసమీక్షకు కేంద్రం ఆదేశాలు

6

స్పష్టం చేసిన అచ్చెన్నాయుడు




3

## ఎలాంటి సమాజంలో బతుకుతున్నాం..!

- వసతి గృహాల్లో సౌకర్యాల లేమిపై హైకోర్టు ఆగ్రహం
- నేలపై నిద్రించే పరిస్థితి వస్తే మన పిల్లలను చేరుస్తామా అని వ్యాఖ్య

4

చైతన్యరథం

# నేడు టీడీపీ, జనసేన జేపీసీ సమావేశం

## ఉమ్మడి మేనిఫెస్టో, కరువు, రైతు సమస్యలపై చర్చించనున్న నేతలు

అమరావతి: టీడీపీ, జనసేన ఉమ్మడి కార్యాచరణ కమిటీ(జేపీసీ) సమావేశం గురువారం జరగనుంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అధ్యక్షతన విజయవాడలోని నోవాటెల్ హొటల్లో జరిగే ఈ సమావేశానికి జేపీసీలోని 12 మంది సభ్యులు హాజరుకానున్నారు. అయితే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈ సమావేశానికి హాజరుకావడం లేదు.

ఈ సమావేశంలో కీలక అంశాలపై చర్చ జరగనుంది. గత సమావేశంలో ఉమ్మడి మేనిఫెస్టోపై పవన్ కళ్యాణ్-నారా లోకేష్ చర్చించారు. ఆ తర్వాత ఇటీవల చంద్రబాబుతో భేటీ అయిన పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ కూడా మేనిఫెస్టోపైనే ఎక్కువగా చర్చించారు. దీనికి కొనసాగింపుగా గురువారం జరిగే సమావేశంలో మేనిఫెస్టోకు తుదిరూపు తీసుకురానున్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పేరిట తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను రూపొందించింది. ఇది మినీ మేనిఫెస్టో మాత్రమే. వాస్తవంగా విజయదశమి రోజు పూర్తిస్థాయి మేనిఫెస్టో విడుదల చేస్తామని చంద్రబాబు అరెస్టుకు ముందు ప్రకటించారు. అది వాయిదా పడింది. సూపర్ సిక్స్‌తో పాటు మరికొన్ని అంశాలతో టీడీపీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అటు జనసేన కూడా షణ్ముఖ వ్యూహం పేరుతో రెండేళ్ల క్రితం ప్రకటించిన అంశాలన్నీ మేనిఫెస్టోలో పొందుపరిచేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. రెండు పార్టీల నుంచి ఉన్న ప్రతిపాదనలపై చర్చించిన తర్వాత మేనిఫెస్టోపై ఓ స్పష్టతకు రానున్నట్లు తెలిసింది. త్వరలో పూర్తిస్థాయి మేనిఫెస్టో విడుదల దిశగా రెండు పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఇక గురువారం జరిగే సమావేశంలో రైతుల సమస్యలపై కూడా చర్చించనున్నారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు, రైతులను ఆదుకోవాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిసింది.

# ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి బహిరంగ లేఖ

అమరావతి: తెలుగుదేశం ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారు సొంత కాళ్లపై నిలబడేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తే, ప్రస్తుతం వారి కాళ్లు విరిచి కట్టు కట్టి మహానుభావులుగా ప్రచారం చేసుకుంటున్నారు. రూ.3లక్షలు సబ్సిడీతో ఇచ్చిన ఇన్నోవా కార్ల పథకం రద్దు చేసి, వాహన మిత్ర పేరుతో డ్రైవర్‌కు రూ.10వేలు ఇచ్చి రెండోవైపు డీజిల్, మద్యం రేట్లు పెంచి, పోలీస్.. ఆర్టీవో జరిమానాలు.. గ్రీన్ ట్యాక్స్ పెంచి ఒక్కో డ్రైవర్ నుండి ఏడాదికి ఒక రూ.లక్ష గుంజుకుంటున్నారు. ఈ రకంగా పేదల్ని నిరుపేదలుగా చేసి, ఓటు యంత్రాలుగా మార్చి, ఎల్లకాలం ప్రభుత్వాలపై ఆధారపడే ఉండేలా మారుస్తున్నారు. ఆదరణతో చేతి వృత్తుల వారికి పనిముట్లు అందించి ఆదాయం పెంచే పథకాన్ని రద్దు చేశారు. పైగా మటన్ మార్టులు, చేపల కొట్లు, 217 జీవోతో మత్స్యకార వృత్తుల వారి ఉపాధిని దెబ్బతీస్తున్నారు. పారిశ్రామిక రాయితీలు నిర్వీర్యం చేశారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను 53నెలలుగా సొంత కాళ్లపై నిలబడకుండా చేసి, ఇప్పుడు బస్సు యాత్రల పేరుతో నయవంచన చేస్తున్నది నిజం కాదా? ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల తరపున అడిగే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలరా?

1. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన రూ.1.14 లక్షల కోట్ల సబ్ ప్లాన్ నిధుల్ని దారి మళ్లించడం వాస్తవం కాదా?
2. అన్న క్యాంటీన్, నిరుద్యోగ భృతి లాంటి 120 సంక్షేమ పథకాలు రద్దు చేయడం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారిని అణగదొక్కడం నిజం కాదా?
3. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 14 లక్షల ఎకరాల అసైన్డ్ భూముల్ని కబ్జా చేసేందుకు కుట్రలు చేస్తుండడం వాస్తవం కాదా?
4. 1.42 లక్షల బ్యాక్ లాగ్ పోస్టుల్ని భర్తీ చేయకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను ఉద్యోగాలు దూరం చేయడం కుట్ర కాదా?
5. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 10 శాతం రిజర్వేషన్లు కోత కోసి 16,800 మందికి రాజ్యాంగబద్ధ పదవులు దూరం చేశారు.
6. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ రద్దు చేసి సుప్రీంకోర్టు వరకు వెళ్లి చీవాట్లు తిన్నారు. స్టడీ సర్కిల్స్, స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు, రెసిడెన్షియల్ స్కూల్స్ రద్దు చేశారు. చివరికి విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు తొలగించి జగనన్న విదేశీవిద్యగా మార్చి అంబేద్కర్‌ను అవమానించారా లేదా?
7. మద్యాన్ని నిషేధిస్తానని హామీ ఇచ్చి, కల్తీ మద్యంతో జేబులు గుల్ల చేశారు. 40 లక్షల మంది ఆరోగ్యాలను దెబ్బతీశారు. 35 వేల మంది ప్రాణాలు తీసి, మహిళల మాంగళ్యాలు మంటగలిపారు. అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలే అధికం అన్నది నిజం కాదా?
8. విద్యుత్, ఆర్టీసీ ఛార్జీలు పెంచారు. ఇసుక ధరలు పెంచి 40లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల ఉపాధిని దెబ్బతీశారు. ధరలు, పన్నులు మోత మోగిస్తూ.. ఒక్కో కుటుంబంపై రూ.2.78 లక్షల భారం మోపారు. ధరలు, ఛార్జీల బాదుడుకు అధికంగా కుంగిపోతున్నది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కాదా?
9. సలహాదారులు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్లను సొంత వారికి కట్టబెట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను మోసం చేయడం కాదా?
10. పై అన్యాయాలను ప్రశ్నించినందుకు 74 మంది బీసీలను, 28 మంది ఎస్సీలను, ముగ్గురు గిరిజనుల్ని, 8 మంది మైనార్టీలను దారుణంగా చంపారు. వేలాది మందిపై దాడులు, అక్రమ కేసులతో జైళ్లలో నిర్బంధించడం వాస్తవం కాదా?

# ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబుకు ముందస్తు బెయిల్‌పై నేడు విచారణ

## 17ఏ వర్తింపు తీర్పుపై అనిశ్చితి

(మొదటి పేజీ తరువాయి)

కానీ ఈ లిస్ట్‌లో చంద్రబాబుకు 17వ వర్తింపుపై తీర్పు లేదు. కానీ చాలా అరుదైన సందర్భాల్లో అదే రోజు ఉదయం ఇరు పార్టీల వారు అందుబాటులో ఉంటే నోటీసు ఇచ్చి తీర్పును వెల్లడించే అవకాశముంది. కానీ ఇది చాలా చాలా అరుదుగా జరుగుతుంది. దీంతో 17ఏ వర్తింపు కేసులో తీర్పుపై అనిశ్చితి కొనసాగుతోంది.

సవరణ చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం తమపై స్కిల్ డెవలప్మెంట్ కేసు పెట్టేముందు రాష్ట్ర గవర్నర్ అనుమతి తీసు కోవాలని, రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించి నందున స్కిల్ కేసులో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని చంద్రబాబు మొదట రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం ఆ పిటిషన్‌ను కొట్టివేయడంతో చంద్రబాబు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్‌ను దాఖలు చేశారు. దానిపై ద్విసభ్య ధర్మాసనం సుదీర్ఘమైన విచారణ చేపట్టింది.



### చంద్రబాబు తరుపు వాదనలు

17 ఏ నిబంధన ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించకుండా చట్టంలో నిర్దేశించబడిన విధాన ప్రక్రియను ఉల్లంఘించి నందున స్కిల్ కేసును కొట్టివేయాలని చంద్రబాబు న్యాయవాదులు హరీష్ సాల్వే, సిద్ధార్థ లూథ్రా గట్టి వాదనలు వినిపించారు. తమ వాదనకు మద్దతుగా గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులను ఉదహరించారు. ముఖ్యంగా ఎంతో ప్రాచుర్యం పొందిన రఫెల్ విమానాల కొనుగోలుకు సంబంధించిన యశ్వంత్ సిన్హా కేసు, లలిత కుమారి కేసులను ప్రస్తావించారు. ఇది 'రెజీమ్ రివెంజ్' ప్రభుత్వ కక్ష సాధింపు కేసు అని పేర్కొం టూ.. చంద్రబాబుపై జగన్ ప్రభుత్వం పెడుతున్న పలువరుస కేసులను ప్రస్తావించారు. విచారణ సందర్భంగా 17ఏ చంద్రబాబుకు వర్తించేలా కనపడుతుందే అని ఒక న్యాయమూర్తి ప్రస్తావించటం గమనార్హం.

### సిఐడి తరపు వాదనలు

అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ జూలై 2018కి ముందు జరిగిన నేరాలకు వర్తించదని సిఐడి తరఫున ముకుల్ రోహిత్గి వాదించారు. స్కిల్ కేస్ విచారణ ఆరంభ దశలో ఉన్నదని,ఈ సమయంలో కేసును కొట్టివేయడం తగదని ఆయన వాదించారు. విచారణ సందర్భంగా స్కిల్ కేసులో ఎఫ్ఐఆర్ ఎప్పుడు నమోదయిదన్న విషయంపై దృష్టి సారించారు. 2016 లోనే జీఎస్టీ అధికారుల సమాచారం మేరకు విచారణ మొదలైందని, కనుక 2018లో అమల్లోకి వచ్చిన 17ఏ చంద్రబాబుకు వర్తించదని ముకుల్ రోహిత్గి వివరించారు. అయితే స్కిల్ కేసులో డిసెంబర్ 2021న నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా విచారణ చేపట్టామని సిఐడి తమ రిమాండ్ రిపోర్ట్‌లో స్వయంగా పేర్కొందని, కనుక 17ఏ చంద్రబాబుకు తప్పక వర్తిస్తుందని సాల్వే సిఐడి వాదనలను బలంగా తిప్పికొట్టారు. ఇరుపక్షాల వాదనలు పలు రోజులపాటు వాడి వేడిగా సాగాయి.

### స్కిల్ కేస్ అక్రమాలు

డిసెంబర్ 2021లో ఈ కేసులో నమోదైన ఎఫ్ఐఆర్‌లో అసలు చంద్రబాబు పేరేలేదు. దాదాపు రెండు సంవత్సరాల తర్వాత చంద్రబాబు పేరును చేర్చారు. విచారణకు రావాలని ఆయనకు ఎటువంటి నోటీసు ఇవ్వలేదు. రాజకీయ కుట్రతో ఆయనను 37వ నిందితుడిగా చేర్చి హడావిడిగా సెప్టెంబర్ 9వ తేదీన అరెస్టు చేసి తప్పుడు రిమాండ్ రిపోర్టుతో చంద్రబాబును రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పంపింది అరాచక జగన్ ప్రభుత్వం. ఎటువంటి సాక్ష్యాధారాలు పొందలేకపోయినా చంద్రబాబును అరెస్ట్‌చేసి, వాటిని తగు సాక్ష్యాలను సాధిస్తామన్న తీరుతో వ్యవహరించింది జగన్ కనుసన్నల్లో నడిచే సిఐడి. వరుస కేసులతో వీలైనంత కాలం చంద్రబాబును ప్రజల్లోకి రాకుండా నిర్బంధించాలనే కుట్రలో భాగంగానే స్కిల్ కేసుకు మొదటగా తెరతీసింది జగన్ ప్రభుత్వం. 52 రోజులపాటు జైల్లో పలు ఇబ్బందులకు గురైన చంద్రబాబు హైకోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌తో వైద్యసేవల కోసం గతనెల 31న బయటకు వచ్చారు. ఉండవల్లిలోని తన స్వగృహానికి వచ్చే దారి పొడవునా ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టడంతో.. 14 గంటల సుదీర్ఘ రోడ్డు ప్రయాణం తర్వాత చంద్రబాబు ఇంటికి చేరగలిగారు.

### వ్యవస్థల దుర్వినియోగం

14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబును తన అరాచక విధ్వంసక పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరుస్తున్నారన్న అక్కసుతో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాజకీయ కుట్రతో కేసుల పరంపరకు తెరతీశాడు. దీని కోసం పలు వ్యవస్థల దుర్వినియోగానికి పాల్పడ్డాడు. నాలుగున్నర ఏళ్ల నిష్క్రియా పర్వం తర్వాత సిఐడిని ఎగదోసి ఎట్టి ఆధారాలు లేకుండా చంద్రబాబును ఇరికించాడు.ఒక్క కేసుతో చంద్రబాబును ఎక్కువ కాలం నిర్బంధించలేమని ఇప్పటికి ఏడు కేసులు పెట్టించాడు. స్కిల్ కేసులో మిగతా 36మంది ఆరోపితులు బెయిల్‌పై ఉన్నా.. చంద్రబాబు బెయిల్‌ను సిఐడి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

స్కిల్ కేసులో సిఐడి పరస్పర విరుద్ధంగా వాదిస్తోంది. ఆ వాదనల ప్రకారం.. స్క్వాష్ పిటిషన్ కొట్టివేత తీర్పులో ఈ కేసు విచారణ అంతిమ దశలో ఉందని హైకోర్టు న్యాయమూర్తి పేర్కొనగా.. విచారణ తొలిదశలోనే ఉందని సుప్రీంకోర్టులో సిఐడి న్యాయవాది రోహిత్గి ద్వారా సుప్రీంకోర్టును తప్పుదోవ పట్టించింది సిఐడి. వాదోపవాదనలను కొనసాగించి తీర్పును ఆలస్యం చేయాలనే దురుద్దేశంతో సుప్రీంకోర్టులో చెప్పిందే చెప్తూ సిఐడి పలు రోజులు కొనసాగించింది.

చంద్రబాబు స్క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పులో ప్రస్తావించిన కొన్ని అంశాలు న్యాయ నిపుణులను ఆశ్చర్యానికి గురిచేశాయి. అధికార బాధ్యతల నిర్వహణకు సంబంధించిన అంశాలకు మాత్రమే 17ఏ వర్తిస్తుందని.. కుట్రపూరితంగా జరిగిన అవినీతితో కూడిన నేరాలకు కాదని న్యాయమూర్తి వ్యాఖ్యానించి చంద్రబాబును ఈ దశలోనే దోషిగా తేల్చడం సబబు కాదని నిపుణుల అభిప్రాయం.

### సుప్రీంకోర్టు తీర్పు చంద్రబాబుకు అనుకూలమా?

సుప్రీంకోర్టులో చంద్రబాబు స్క్వాష్ పిటిషన్‌పై సాగిన ఇరు పక్షాల వాదనలలోని బలాబలాలు, అవినీతి నిరోధక సవరణ చట్టం 2018ప్రధాన ఉద్దేశం, రాజకీయ ప్రేరిత కేసులను అరికట్టవలసిన అవసరం, గతంలో యశ్వంత్ సిన్హా మరియు ఇతర కేసుల్లో వచ్చిన సుప్రీంకోర్టు తీర్పుల ఆధారంగా చంద్రబాబుకు 17ఏ వర్తింపుపై సానుకూల తీర్పు వస్తుందని న్యాయ కోవిదులు, టిడిపి నాయకులు, శ్రేణులు, దేశ విదేశాల్లోని చంద్రబాబు అభిమానులు విశ్వాసంతో ఉన్నారు.

తీర్పు చంద్రబాబుకు అనుకూలంగా వస్తే ఆయనపై ఇప్పటి వరకు నమోదైన ఇతర అవినీతి కేసులు వీగిపోతాయని న్యాయ నిపుణుల అభిప్రాయం. 17ఏ విషయంలో సుప్రీం కోర్టు ఇవ్వనున్న తీర్పు చారిత్రాత్మకం అవుతుందని, రాజకీయ కక్ష సాధింపులకు వ్యవస్థలను దుర్వినియోగం చేసే జగన్ మార్కు కుట్రలకు అడ్డుకట్ట వేస్తుందని విశ్వాసంతో పలువురు వేచి ఉన్నారు. ఈ నేపథ్యంలో 17ఏ పై రానున్న తీర్పు ఒక కొత్త అధ్యాయానికి తెర తీయనుంది. 17ఏ విషయంలో సుప్రీంకోర్టు ఇవ్వనున్న తీర్పు న్యాయానికే పరీక్షకానుంది. ఏం జరగనుందో.. తెలుసుకోవడానికి వేచి చూద్దాం!

# కొందరు పోలీసులు మూల్యం చెల్లించుకోక తప్పదు: లోకేష్

## తప్పుడు కేసుల నమోదులో గిన్నిస్ బుక్‌లో స్థానం కోసం పోటీ పడుతున్నారని విమర్శ

అమరావతి: తప్పుడు కేసులు బనాయించడంలో కొంతమంది పోలీసులు గిన్నిస్ బుక్‌లో స్థానం కోసం పోటీ పడుతున్నట్లుగా కన్పిస్తోందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. పల్నాడు జిల్లా రొంపిచర్లకు చెందిన నరసరావుపేట నియోజకవర్గ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డిని సామాజిక మాధ్యమాల్లో పోస్టుల కేసు విచారణ కోసం అంటూ తీసుకెళ్లి అక్రమ మద్యం కేసులో ఇరికించారని లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నాలుగున్నరేళ్లుగా టీడీపీ కార్యకర్తలు, నాయకులపై రాష్ట్రవ్యాప్తంగా 60వేల తప్పుడు కేసులు బనాయించారు. సైకో సీఎం కళ్లలో ఆనందం కోసం న్యాయదేవత కళ్లకు గంతలుకట్టి టీడీపీ కేడర్‌ను ఇబ్బందుల పాల్జేస్తున్న కొంతమంది పోలీసులు త్వరలో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

### 28 వరకు చంద్రబాబును
# అరెస్ట్ చేయబోమన్న సీఐడీ

**ఇసుక కేసులో ముందస్తు బెయిల్‌పై విచారణ 22కి వాయిదా వేసిన హైకోర్టు**

అమరావతి: ఇసుక కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బెయిల్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో బుధవారం మధ్యాహ్నం విచారణ జరిగింది. విచారణలో భాగంగా చంద్రబాబును ఈనెల 28 వరకు అరెస్ట్ చేయబోమని సీఐడీ తేల్చి చెప్పింది. ఇసుక కేసులో చంద్రబాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ఆయన తరపు న్యాయవాదులు ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చంద్రబాబు పిటిషన్ హైకోర్టులో విచారణకు రాగా.. తాము చంద్రబాబును 28వరకు అరెస్ట్ చేయబోమని సీఐడీ తరపు న్యాయవాదులు కోర్టుకు చెప్పారు. సీఐడీ న్యాయవాదుల స్టేట్‌మెంట్‌ను హైకోర్టు ధర్మాసనం రికార్డ్ చేసింది. తదుపరి విచారణను ఈనెల 22కు వాయిదా వేసింది. కాగా.. ఈ నెల 28 వరకు చంద్రబాబుకు అనారోగ్య కారణాల రీత్యా హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిన విషయం తెలిసిందే.

## రాష్ట్రంలో ఆర్థిక కుంభకోణాలపై సీబీఐ విచారణకు హైకోర్టులో రాఘురామ పిల్

- నాట్ బిఫోర్ మి అన్న న్యాయమూర్తి
- వేరే బెంచ్ ముందు విచారణకు రిజిస్ట్రీకి సీజే ఆదేశం

అమరావతి: రాష్ట్రంలో ఆర్థిక కుంభకోణాలపై సీబీఐ విచారణ జరపాలని వైసీపీ రెబల్ ఎంపీ రఘురామ కృష్ణరాజు వేసినపిల్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. సీఎం జగన్, ఆయన బంధుగణం, వివిధ కంపెనీలకు రూ. కోట్లలో లబ్ధి చేకూర్చేలా వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, రూపొందించిన పాలసీల పై సీబీఐ విచారణ కోరుతూ రఘురామ తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధర్‌రావు వేసిన పిటిషన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ డీఎస్ ఠాకూర్, జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం ముందుకు పిటిషన్ విచారణకు వచ్చింది. పిల్‌పై విచారణ ప్రారంభమైన వెంటనే నాట్ బిఫోర్ మీ అంటూ ధర్మాసనంలోని న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు విచారణ నుండి తప్పుకున్నారు. దీంతో మరో ధర్మాసనం ముందు విచారణకు వచ్చేలా చూడాలని రిజిస్ట్రీకి సీజే ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఆర్థిక అవకతవకలపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశించాలని రఘురామ కృష్ణరాజు పిల్‌లో కోరారు.

# జగన్‌కు నోటీసులు శుభపరిణామం

**ఏపీలో ఆర్థిక కుంభకోణాలపై పిటిషన్ దాఖలు చేశా: రఘురామ**

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక కుంభకోణాలపై పిటిషన్ దాఖలు చేశానని.. వేరే ధర్మాసనం ముందు త్వరలో విచారణకు రానుందని, వాలంటీర్లను అడ్డుపెట్టుకొని అన్ని కార్యక్రమాలు చేస్తున్నారని ఎంపీ రఘురామకృష్ణరాజు విమర్శించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ సీఎం జగన్ అక్రమాస్తులపై త్వరగా విచారణ జరపాలని మాజీ ఎంపీ హరిరామ జోగయ్య పిటిషన్ వేయడం మంచి పరిణామమని, ఈ మేరకు తెలంగాణ హైకోర్టు జగన్‌కు నోటీసులు ఇవ్వడం శుభ పరిణామమన్నారు. అన్నీ ఒక్కసారిగా ముంచుకు వస్తున్నాయి.. ఏం జరుగుతుందో చూడాలన్నారు. సీఐడీ చీఫ్ సంజయ్, ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి దేశం అంతటా తిరిగి ప్రెస్ మీట్‌లు పెట్టవచ్చా? చంద్రబాబు మాత్రం కేసుపై మాట్లాడొద్దని అంటారా అంటూ మండిపడ్డారు.



ఢిల్లీలో ఒక హోటల్లో సీఐడీ అధికారి సంజయ్, సుధాకర్‌రెడ్డి పెట్టిన ప్రెస్ మీట్‌కు ఎవరు డబ్బులు కట్టారు.. బిల్లులు ఎలా చెల్లించారని రఘురామ ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి సీఎం అవ్వగానే ప్రజావేదిక కూల్చారని, ప్రజావేదిక నిర్మాణానికి కాబినెట్ ఆమోదం కూడా ఉందని, అధికారులకు బుద్ధి ఉండాలి కదా అని అన్నారు. ప్రజావేదికను కూల్చడానికి ఎవరు హక్కు ఇచ్చారని సీఆర్డీఏ అధికారులను ఆయన ప్రశ్నించారు. దీనిపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేస్తానన్నారు. రెండు రోజుల్లో చంద్రబాబు నాయుడుపై పెట్టిన 17ఏ కేసు కొట్టేస్తారని రఘురామ అభిప్రాయం వ్యక్తం చేశారు.

టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పని తీరు అద్భుతమని, ప్రజల కొరకు నిరంతరం పని చేస్తారని రఘురామ కొనియాడారు. పాలకొల్లులో టిడ్కో ఇళ్లు ప్రజలకు ఇచ్చినట్టే ఇచ్చి..దానిపై ప్రభుత్వం రుణం తీసుకుందని విమర్శించారు. ఇదొక పెద్ద స్కాం అని అన్నారు. రేపు జగన్మోహన్‌రెడ్డి ఏపీలో ఉన్న అందరి ఆస్తులను బ్యాంకుల్లో తాకట్టు పెట్టే అవకాశం ఉందన్నారు. టీటీడీ నియమాలు ఈవో ధర్మారెడ్డికి తెలియవని, నియమ, నిబంధనలు తెలియకుండానే సీఎం జగన్ ఆయనను నియామకం చేశారని రఘురామ విమర్శించారు.

## అవినీతి, నేర పాలకుడి వల్ల ప్రైవేటు బాటలో విశాఖ ఉక్కు: లోకేష్

అమరావతి: విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో ప్రజలు సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్.. జగన్ అనే అవినీతి నేర పాలకుడి వల్ల ప్రైవేటు బాట పడుతోందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకి నిరసనగా పోరాట కమిటీ చేపట్టిన ఉద్యమానికి వెయ్యి రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా కార్మికులకి ఉద్యమాభివందనాలు తెలియజేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ పోరాటానికి తెలుగుదేశం పార్టీ మద్దతు సంపూర్ణంగా ఉంటుందని స్పష్టం చేశారు.

# సీఐడీ చీఫ్, ఏఏజీ ప్రెస్‌మీట్లపై రఘురామ ఇంప్లీడ్ పిటిషన్

- ప్రెస్‌మీట్ వార్తలు ఇంగ్లీషులోకి అనువదించి ఇవ్వాలన్న హైకోర్టు
- విచారణ మూడు వారాలకు వాయిదా

అమరావతి: సీఐడీ చీఫ్ సంజయ్, అడిషనల్ ఏజీ సుధాకర్ రెడ్డిపై హైకోర్టులో దాఖలైన పిల్‌లో ఇంప్లీడ్ అయ్యేందుకు వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటి షన్ విచారణార్హతపై బుధవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. న్యాయవాదులు నర్రా శ్రీనివాస్, ఉమేష్‌చంద్ర వాదనలు వినిపించారు. సీఐడీ, ప్రాసిక్యూషన్ ఇండి పెండెంట్ ఏజెన్సీలని చెబుతూ సంజయ్, సుధాకర్ రెడ్డి ప్రెస్‌మీట్‌లో పాల్గొనడం న్యాయ పరిపాలనకు వ్యతిరేకమన్నారు. చంద్రబాబు దోషి అని అప్పుడే ఎలా చెబుతారని ప్రశ్నించారు. వీరి వ్యాఖ్యలు ట్రైల్ కోర్టును ప్రభావితం చేసేలా ఉన్నాయన్నారు. సివిల్ సర్వీస్ కాండక్ట్ రూల్స్‌కు కూడా ఇవి వ్యతిరేకమన్నారు. విజయవాడ, హైదరాబాద్, ఢిల్లీల్లో నిర్వహించిన ప్రెస్ మీట్ క్లిప్పింగ్స్‌ను న్యాయస్థానానికి అందజేశారు. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోవచ్చని ధర్మాసనం ప్రశ్నించగా, సివిల్ సర్వీస్ కాండెక్ట్ రూల్స్ ప్రకారం చర్యలు చేపట్టాలని లాయర్ల సూచించారు. ముందు ఇంప్లీడ్ పిటిషన్‌ను అనుమతించాలని వాదనలు వినిపించారు. ముందు తమకు ప్రెస్ మీట్‌కు సంబంధించిన వార్తలు ఆంగ్లంలోకి అనువదించి ఇవ్వాలని కోర్టు సూచించింది. వచ్చే వాయిదాలో ఇంప్లీడ్ పిటిషన్‌పై నిర్ణయం తీసుకుంటామంది. విచారణకు మూడు వారాలకు వాయిదా వేసింది.




సీఐడీ చీఫ్ సంజయ్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ సుధాకరరెడ్డి ఢిల్లీ, హైదరాబాద్‌లో మీడియా సమావేశం పెట్టి ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఏపీ యునైటెడ్ ఫోరం ఫర్ యునైటెడ్ క్యాంపెయిన్ అధ్యక్షుడు సత్యనారాయణ ఇటీవల హైకోర్టులో పిటిషన్ వేశారు. చంద్రబాబుపై వ్యక్తిగత కక్ష తీర్చుకొనేందుకు ప్రెస్ మీట్‌లు పెట్టి ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. పబ్లిక్ సర్వెంట్‌లుగా ఉండి ప్రెస్ మీట్‌లు పెట్టడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. వృథా చేసిన ప్రజాధనాన్ని వారి నుంచి రాబట్టాలని కోరారు. ఈ అంశంలో తన వాదనలు కూడా వినాలంటూ రఘురామ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు.

# అది ఫేక్ లేఖ!

- టీడీపీ అధినేత చంద్రబాబు సంతకంతో ప్రచారంలో ఉన్నలేఖ ఫేక్
- తెలంగాణ ఎన్నికలపై చంద్రబాబు ఎవరికీ ఎలాంటి సూచనలు చేయలేదు
- చంద్రబాబు ఇమేజ్ ను దెబ్బతీసేందుకు వైసీపీ కుట్రలో భాగమే ఈ దొంగ లేఖ
- ఫేక్ లేఖతో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం
- స్పష్టం చేసిన అచ్చెన్నాయుడు

అమరావతి: వైసీపీ బతుకే ఫేక్ బతుకని, ఫేక్ ప్రచారాలు, ఫేక్ లేఖలనే ఆ పార్టీ నమ్ముకుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు



ఇవ్వాలని కమ్మ సామాజిక వర్గానికి చంద్రబాబు లేఖ రాసినట్లు ఒక ఫేక్ లేఖను ప్రచారంలో పెట్టడాన్ని ఖండించారు. ఈ లేఖ పూర్తిగా అవాస్తవమని, చంద్రబాబు ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు వైసీపీ మొద టి నుంచి ఇలాంటి కుట్ర రాజకీయాలనే నమ్ముకుందని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు తెలుగుదేశం దూరంగా ఉందని, పార్టీ కార్యకర్తలకు గానీ, అభిమానులకు గానీ ఎవరికి ఓటెయ్యాలి అనే విషయంలో చంద్రబాబు ఎటువంటి సూచనలు చేయలేదని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని కమ్మ సామాజిక వర్గానికి చంద్రబాబు లేఖ రాసినట్లు ఒక ఫేక్ లేఖను సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేస్తున్నారని దాన్ని నమ్మవద్దని అచ్చెన్నాయుడు కోరారు. ఈ లేఖలో చంద్రబాబు సంతకం సైతం ఫోర్జరీ చేశారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. పోలీసుశాఖకు చిత్తశుద్ధి ఉంటే ప్రతిపక్ష పార్టీలు, నేతలపై అసత్య ప్రచారాలకు పాల్పడుతున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు.

# జగన్‌కు మరో ఝలక్!

- జోగయ్య పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు నోటీసులు
- అక్రమాస్తుల కేసు విచారణలో జాప్యంపై హరిరామజోగయ్య పిటిషన్
- ఎన్నికల్లోగా తీర్పులను వెలువరించాలని పిటిషన్‌లో విన్నపం
- జగన్, సీబీఐ, సీబీఐ కోర్టులకు తెలంగాణ హైకోర్టు నోటీసులు

హైదరాబాద్: ఏపీ ముఖ్యమంత్రి జగన్‌కు మరో ఝలక్ తగిలింది. అక్రమాస్తుల కేసును త్వరగా తేల్చేలా ఆదేశాలివ్వాలంటూ మాజీ ఎంపీ హరిరామజోగయ్య దాఖలు చేసిన పిల్‌ను విచారణకు స్వీకరించిన తెలంగాణ హైకోర్టు.. జగన్‌కు, సీబీఐకి, సీబీఐ కోర్టుకి నోటీసులు జారీ చేసింది. జగన్ కేసుల విచారణలో జరుగుతున్న జాప్యంపై వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై ఇటీవల సుప్రీంకోర్టు కూడా జగన్‌కు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోపు జగన్ అక్రమాస్తుల కేసులను తేల్చేలా ఆదేశాలివ్వాలని తెలంగాణ హైకోర్టులో మాజీ ఎంపీ హరిరామ జోగయ్య దాఖలు చేసిన పిటిషన్ ను విచారణకు స్వీకరించారు. జగన్, సీబీఐలకు తెలంగాణ హైకోర్టు సీజే బెంచ్ నోటీసులు జారీ చేసింది. గతంలో జోగయ్య దాఖలు చేసిన పిల్‌పై తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ అభ్యంతరాలపై బుధవారం హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రావణ్ కుమార్ ధర్మాసనం దీనిని విచారించింది. జోగయ్య తరపు లాయర్ వివరణతో హైకోర్టు సీజే ధర్మాసనం సంతృప్తి చెందింది. ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా పరిగణించేందుకు అంగీకరించింది. నెంబరు కేటాయించాలని రిజిస్ట్రీకి ఆదేశాలు ఇచ్చారు. ప్రతివాదులు జగన్, సీబీఐకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణల్లో హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోంది? సీబీఐకి, సీబీఐ కోర్టుకు ఎలాంటి ఆదేశాలను ఇవ్వబోతోంది? అనే విషయం ఉత్కంఠగా మారింది.

ఇలాంటి పిటిషనే సుప్రీంకోర్టులో గత శుక్రవారం వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేశారు. కేసులు విచారణకు రాకుండా వేల సంఖ్యలో డిశ్చార్జ్ పిటిషన్లు, వాయిదాల పిటిషన్లు వేస్తున్నారని, ఈ కేసు విచారణ వేరే రాష్ట్రానికి తరలించాలని రఘురామ కోరారు. 3071 సార్లు జగన్ కేసును సీబీఐ కోర్టు వాయిదా వేసినట్లు పిటిషన్‌లో ప్రధానంగా ప్రస్తావించారు. జగన్ ప్రత్యక్షంగా హాజరుకాకుండా సీబీఐ కోర్టు మినహాయింపు ఇచ్చిందని.. వందల కొద్ది డిశ్చార్జి పిటిషన్లు వేసినట్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు జగన్ తో పాటు సీబీఐకి నోటీసులు జారీ చేసింది. వచ్చే ఒకటి, రెండు నెలల్లో జగన్ అక్రమాస్తుల కేసుల్లో కీలక అడుగులు పడే అవకాశాలు ఉన్నాయని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.

చైతన్యరథం

# చెట్టు ఫొటోతో ఓటు!

## అపహాస్యంగా ఓటర్ల జాబితాల ప్రక్రియ: అచ్చెన్నాయుడు



అమరావతి: రాష్ట్ర ప్రజలు తమపై తీవ్ర అగ్రహంతో ఉన్నారని పసిగట్టిన జగన్ రెడ్డి, అతని ప్రభుత్వం ఓటర్ల జాబితాలో అవకతవకలకు తెరలేపిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగఓట్లు సృష్టించడం.. అర్హుల ఓట్లు తొలగించడం అనే తంతుని నిరంతరం కొనసాగిస్తున్నారని, ప్రత్యేకంగా దొంగఓట్ల కోసమే వాలంటీర్ల, సచివాలయ వ్యవస్థను జగన్‌రెడ్డి ఏర్పాటు చేసినట్టు కనిపిస్తోందని విమర్శించారు.

టీడీపీ నేతలతో కలిసి, రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఏపీ ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాను కలిసి ఓటర్ల జాబితాలో అక్రమాలపై అచ్చెన్నాయుడు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కలిసినవారిలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎంఏ.షరీఫ్, వర్ల రామయ్య, బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు, తదితరులు ఉన్నారు.అనంతరం అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా ఉపాధ్యాయులు.. కొందరు ప్రభుత్వాధికారులు ఎన్నికల వ్యవస్థలో కీలకంగా పనిచేసేవారన్నారు. కానీ జగన్‌రెడ్డి ఒక దుర్బుద్ధితో వాలంటీర్.. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చాడు. ఆ వ్యవస్థలు ఎన్నికల ప్రక్రియలో వేలు పెట్టడం.. ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడటం రివాజుగా మారింది. ఈమాట మేం అనడంలేదు.. అన్ని పార్టీలు.. ప్రజలు అంటున్నారు. మీడియాలో వచ్చే కథనాలు కూడా ప్రజల అభిప్రాయాన్ని ధృవీకరిస్తున్నాయని అచ్చెన్నాయుడు అన్నారు.

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఒక చెట్టు పేరుతో ఓటర్ల జాబితాలో ఓటు సృష్టించారు. ఒక్కో వ్యక్తికి మూడు, నాలుగుచోట్ల దొంగ ఓట్లు కల్పించారు. సాధారణ వ్యక్తులకు కాదు.. ఏకంగా ప్రభుత్వపెద్దలు, మంత్రులుగా ఉన్నవారికే రెండు మూడు చోట్ల ఓట్లున్నాయి. మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌కు నెల్లూరులోని మూడుప్రాంతాల్లో ఓట్లున్నాయి. అనిల్‌కుమార్ ఎవరో ఈ ప్రభుత్వానికి.. అధికారులకు తెలియదా?

ఇలాంటి అనైతిక పద్ధతుల్లో, మరీ ముఖ్యంగా చెప్పాలంటే కేవలం దొంగ ఓట్లతోనే వచ్చేఎన్నికల్లో గెలవాలని జగన్‌రెడ్డి విశ్వప్రయత్నాలు చేస్తున్నాడని అచ్చెన్నాయుడు దుయ్యబట్టారు.

### ప్రతిపక్షాల విజ్ఞప్తులు.. ఎన్నికల సంఘం ఆదేశాలను బుట్టదాఖలు చేస్తున్నారు

ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రక్రియలో జరిగే తప్పులు.. ఓటర్ల జాబితాకు సంబంధించిన తప్పుల్ని స్థానికంగా ఉండే జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్తున్నాం. వారు స్పందించకపోతే ఎప్పుడు వీలైతే అప్పుడు రాష్ట్రఎన్నికల ప్రధానాధికారిని కలుస్తున్నాం. కానీపై స్థాయి నుంచి వచ్చే ఆదేశాలను జిల్లా కలెక్టర్లు బుట్టదాఖలు చేస్తున్నారు. దొంగ ఓట్లు.. అర్హులైన ఓట్లు తీసేసిన దానికి సంబంధించి ఆధారాలతో సహా కలెక్టర్లకు ఫిర్యాదు చేస్తున్నావారు స్పందించడం లేదని అచ్చెన్నాయుడు ఆరోపించారు.

### పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించకుండానే..

కొత్త ఓటర్ల చేర్పులు.. చనిపోయినవారి ఓట్లు తొలగించడం..అదే విధంగా ఓటర్ల జాబితాను సరిచేయడం అనేది ఎన్నికల ప్రక్రియలో చాలా కీలకం. గతంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వెరిఫికేషన్ చేసినప్పుడు, పైన చెప్పిన మూడు అంశాలకు సంబంధించి అధికారులు.. బీఎల్వోలు ఓటర్ల నుంచి సమాచారం సేకరించారు. కానీ గతనెలలో ఎన్నికలకమిషన్ విడుదలచేసిన ముసాయిదా ఓటర్ లిస్ట్ చూశాక ఓటర్ల నుంచి బీఎల్వోలు సమాచారంపై క్షేత్రస్థాయి సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోలేదని అర్థమైంది. ఫామ్-6, ఫామ్-7, ఫామ్-8ల వివరాలు ఎన్నికల కమిషన్ వెబ్ సైట్లో కనిపిస్తున్నాయి గానీ, ముసాయిదా ఓటర్ల జాబితాలో వాటికి సంబంధించిన మార్పుచేర్పులు కనిపించడం లేదు.కొత్త ఓటర్ల చేర్పులకు సంబంధించి 2లక్షల 9వేల ఫామ్-6లు దరఖాస్తు చేస్తే, ఆ వివరాలు ఎన్నికల కమిషన్ వెబ్ సైట్లో నమోదయ్యాయి. కానీ క్షేత్రస్థాయిలో వాటికి సంబంధించిన ఓటర్ల చేర్పుల ప్రక్రియ జరగలేదు. అలానే ఫామ్ -7ల దరఖాస్తులు 5.58లక్షలు ఇచ్చాం. ఓటర్ల జాబితాలో సవరణలు సూచిస్తూ ఫామ్-8 దరఖాస్తులు 7.16లక్షల వరకు ఎన్నికల కమిషన్‌కు అందించాం. అవన్నీ ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్లో కనిపిస్తున్నాయి.. కానీ ఆయా దరఖాస్తు సమాచారాన్ని అధికారాలు పరిగణనలోకి తీసుకోలేదని డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ చూశాక అర్థ మైంది. మేము ఇచ్చిన దరఖాస్తులపై అధికారుల నుంచి ఎలాంటి స్పందనాలేదు. పరిగణనలోకి తీసుకున్నామని.. లేదని.. ఇతర కారణాలు ఏమీ చెప్పలేదు? గతంలో ఇచ్చిన దరఖాస్తులు పరిష్కరించకుండా మరలా కొత్తగా ఇంటింటికీ వెళ్లి ఫామ్-6, ఫామ్-7, ఇతర వివరాలు సేకరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫామ్-6, ఫామ్-7 వంటి దరఖాస్తులన్నీ కలిపి ఇప్పటికే 11లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించకుండా మరలా వివరాలు అడగడం సరికాదని కూడా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి చెప్పామని అచ్చెన్నాయుడు తెలిపారు.

### కిందిస్థాయి అధికారులు.. సహకరిస్తున్న కలెక్టర్లపై కఠినచర్యలు తీసుకోవాలి

నియోజకవర్గాల వారీగా నమోదైన దొంగఓట్లు.. అర్హుల ఓట్ల తొలగింపు వివరాలను కూడా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముందు ఉంచాం. కానీ క్షేత్రస్థాయిలో తప్పుచేసిన అధికారులు..ఇతరులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దాదాపు 18 నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలు సరిగాలేవు. స్థానిక ఎమ్మెల్యేల ప్రోద్బలంతోనే పోలింగ్ కేంద్రాలు మార్చడం లేదు. దానిపై కూడా దృష్టి పెట్టాలని చెప్పాం. మొక్కుబడిగా ఒకరినో ఇద్దరినో సస్పెండ్ చేస్తే ఈ సమస్య పరిష్కారం కాదని.. సీరియస్‌గా వ్యవహరించాలని ఎన్నికల ప్రధానాధికారిని కోరాం. మా విజ్ఞప్తులపై ఆయన స్పందించారు. అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఈ ఒక్కరోజే 13 లేఖలు అందించాం. గతంలో కూడా పలుమార్లు అనేక ఫిర్యాదులు చేశాం. ఇదే విషయం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారితో కూడా చెప్పాం. అధికారులు మీ ఆదేశాలను పట్టించుకోవడం లేదు.. వైసీపీ నేతల కనుసన్నల్లోనే అధికారులు, కొందరు కలెక్టర్లు పనిచేస్తున్నారని నిర్మొహమాటంగా చెప్పాం. ఈ విషయాలపై తప్పని సరిగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి చెప్పారని అచ్చెన్నాయుడు తెలిపారు.

### త్వరలోనే కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం

ఇప్పటివరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ముందుంచిన అన్ని వివరాలను..ఫిర్యాదుల్ని త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) ముందు కూడా ఉంచుతాం. ఓటర్ల జాబితాలో జరుగుతున్న అవకతవకలు..దొంగ ఓట్ల వ్యవహారం..ఎన్నికలప్రక్రియకు సంబంధించిన ఇతర అంశాలపై త్వరలోనే టీడీపీ ఎంపీలతోకలిసి సీఈసీకి ఫిర్యాదుచేస్తాం.రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా,ప్రజాస్వామ్య బద్ధంగా జరగాలన్నదే టీడీపీ అభిమతం. ఎందరు అధికారులపై..ఇతర సిబ్బందిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో పోలీస్‌శాఖ నుంచి వివరాలు తీసుకోవాలని రాష్ట్రఎన్నికల ప్రధానాధికారికి చెప్పాం.దానికి ఆయన కూడా సరేనన్నారు. వైసీపీలోని పెద్దపెద్ద నాయకులే సిగ్గులేకుండా దొంగఓట్లు చేర్పిస్తున్నారు. బూత్‌ల వారీగా త్వరలోనే ఆసమాచారంకూడా ఎన్నికలసంఘం ముందు ఉంచుతామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

### అధికారుల్ని ప్రశ్నిస్తుంటే వెటకారంగా మాట్లాడుతున్నారు: బొండా ఉమా

ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎన్నికల కమిషన్ చేపట్టిన స్పెషల్ డ్రైవ్ అనేది రాష్ట్రంలో అపహాస్యంగా మారిందని టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఆర్వోలు.. కలెక్టర్ల చుట్టూ తిరగడమే ప్రతిపక్షాల పని అయిపోయింది. కలెక్టర్లు..కిందిస్థాయి సిబ్బంది ఫామ్-7 దరఖాస్తుల విషయంలో తాడేపల్లి ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తున్నారు.ఫామ్-7 దరఖాస్తుల విషయంలో టీడీపీ ఓట్లు తొలగించే విషయంలో అధికారులు పోటీలు పడి పనిచేస్తున్నారు. వారికి వాలంటీర్లు.. సచివాలయ సిబ్బంది సహకరిస్తున్నారు. అనర్హుల ఓట్లు తీసేయమని టీడీపీ ఇచ్చే దరఖాస్తులపై మాత్రం తమకేమీ పట్టనట్టే వ్యవహరిస్తున్నారు.

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం (నియోజకవర్గం నెం-80)లో పోలింగ్ స్టేషన్ నెం-62 లో ఒక వైసీపీ నాయకుడి తల్లిపేరుతో మూడు ఓట్లు నమోదు చేశారు. ఒకే వ్యక్తికి...ఒకే ఫోటోతో ఒకే పోలింగ్ స్టేషన్లో అధికారుల ప్రమేయం లేకుండా మూడు ఓట్లు ఎలా నమోదవుతాయి? అవి ఎందుకు తీసేయరని మేం స్థానిక అధికారుల్ని ప్రశ్నిస్తే రూల్స్ ప్రకారం స్పందిస్తామని చెబుతున్నారు. అవే రూల్స్ .. ఇతర నిబంధనలు దొంగఓట్లు తీసేయడంలో ఎందుకు చూపించటం లేదని బొండా ప్రశ్నించారు..

నగరపాలక అధికారులు,మున్సిపల్ అధికారులవద్ద పౌరుల జననమరణాల వివరాలు ఉంటాయి. వాటి ప్రకారం ఎవరు చనిపోయారో ఓట్లు తొలగించే ముందు అధికారులు ఎందుకు పరిశీలించలేదు మరీదారుణంగా విజయవాడసెంట్రల్ నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్-44లో ఒక చెట్టుని ఓటరుగా చూపారు. అధికారపార్టీకి నచ్చితే చెట్టుకు... పుట్టకు... ఆఖరికి చెప్పులకు కూడా ఓట్లు పుట్టిస్తారు. టీడీపీ వాళ్ల దొంగ ఓట్లు తీసేయమంటే నిబంధనలు అంటున్న అధికారులకు ఇలాంటి వింతలు కనిపించడం లేదా అని బొండా నిలదీశారు. అధికారులు.. కొందరు కిందిస్థాయి సిబ్బంది పని తీరుతో ఇంతకు ముందు జరిగిన ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలన అంతా ప్రహసనంగా మారింది. 2019ఎన్నికల్లో 25ఓట్లతో ఓడిపోయాను. ఇప్పుడు నానియోజకవర్గంలో 12,000దొంగఓట్లు చేర్చారు. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోరని అధికారుల్ని ప్రశ్నిస్తుంటే.. వెటకారంగా సమాధానమిస్తున్నారు. ఆధారాలు చూపిస్తున్నా.. పట్టించుకోని వారిని ఏం చేయాలో మీరే ఆలోచించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి సూచించాం. ఈప్రభుత్వ కుట్రలు.. కుతంత్రాలను అమలుకానివ్వం. అర్హులైన ప్రతిఒక్కరూ రాష్ట్రంలో ఓటు హక్కు వినియోగించుకోవాలి.. అలానే దొంగ ఓటు ఒక్కటీ ఉండకూడదన్నదే టీడీపీ లక్ష్యం. ఓటమి భయంతోనే జగన్‌రెడ్డి అధికారుల్ని అడ్డుపెట్టుకొని ఓటర్ల జాబితాలో ఇలాంటి అవక తవకలకు పాల్పడు తున్నాడని బొండా ఉమా ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎలాంటి సమాజంలో బతుకుతున్నాం..!

### వసతి గృహాల్లో సౌకర్యాల లేమిపై హైకోర్టు ఆగ్రహం

### నేలపై నిద్రించే పరిస్థితి వస్తే మన పిల్లలను చేరుస్తామా అని వ్యాఖ్య

అమరావతి: వసతి గృహాల్లో నేలపై నిద్రించే పరిస్థితి వస్తే మన పిల్లలను చేరుస్తామా అని ఏపీ హైకోర్టు వ్యాఖ్యానించింది. వసతి గృహంలో నెలకొన్న అసౌకర్యాలపై బుధవారం విచారణ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని గోడి బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారని సామాజిక కార్యకర్త పచ్చిమాల బాబి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. విచారణకు స్వీకరించిన హైకోర్టు.. పరిశీలించి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని కలెక్టర్, సాంఘిక సంక్షేమశాఖ ఉన్నతాధికారులు, పాఠశాల ప్రిన్సిపల్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా న్యాయమూర్తికి ఆదేశాలు జారీ చేసింది. వసతి గృహాల్లో పిల్లలు నిద్రించేందుకు మంచం, పరుపు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత కాదా? అని ప్రశ్నించింది. ఎలాంటి సమాజంలో బతుకుతున్నాం. ఇలాంటి పరిస్థితులు రావడం దురదృష్టకరం. వసతి గృహాల్లో సౌకర్యాల మెరుగుకు సమయం ఆసన్నమైంది.

గురుకుల పాఠశాలల్లో కల్పించాల్సిన సౌకర్యాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. 1.70 లక్షల విద్యార్థులకు మంచాలు అందించడంపై నిర్ణయం తీసుకోవాలి అని ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణను హైకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# సైనికుడిపై పోలీసుల దాడి హేయం: లోకేష్

### దిశ యాప్ పేరుతో ఏదో దందా నడుస్తోందని అనుమానం

అమరావతి: దేశ భద్రత కోసం తన ప్రాణాలను పణంగా పెట్టే సైనికుడు, ఏపీకి వస్తే ఆయన ప్రాణాలకే రక్షణ లేని దుస్థితి నెలకొందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం తెచ్చిన దిశా చట్టంకి దిక్కూ మొక్కూ లేదు. జగనాసుర పాలనలో మహిళలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. మహిళల భద్రతకు అంటూ సర్కారు తెచ్చిన దిశ యాప్ పేరుతో ఏదో దందా నడుస్తోంది. మహిళలు వేసుకోవాల్సిన దిశ యాప్ పురుషుల మొబైల్‌లో బలవంతంగా డౌన్లోడ్ చేయించడం అనుమానాలకి తావిస్తోంది. ఇదే విషయాన్ని ప్రశ్నించిన అనకాపల్లి జిల్లా రేగుపాలేనికి చెందిన సైనికుడు సయ్యద్ అలీముల్లాపై గూండాల్లా పోలీసులు దాడి చేయడం దారుణం. మీరు పోలీసులేనా అని అడిగినందుకు ఒక సైనికుడిపై పోలీసులు దాడి చేయటం రాష్ట్రంలో పరిస్థితికి అద్దం పడుతోందని లోకేష్ విమర్శించారు.

అమరావతి: రాష్ట్రంలో ఓటర్ల జాబితా రూపకల్పనలో పెద్దఎత్తున జరుగుతున్న అవతకవకలను రాష్ట్ర ఎన్నికల సంఘం పట్టించుకోని పరిస్థితుల్లో ఈ అంశంపై జాతీయస్థాయిలో సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ (సీఈసీ) దృష్టికి తీసుకెళ్లాలని తెలుగుదేశంపార్టీ నిర్ణయించింది. ఉండవల్లిలోని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నివాసంలో టీడీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు,నక్కా ఆనంద్‌బాబు, కొల్లు రవీంద్ర, ఎంఎ షరీఫ్, వంగలపూడి అనిత, పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్, టీడీఎల్పీ ఉపనేత నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్యే టీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. ఓటరులిస్టులో అవకతవకలను బయటకు తీసి రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో, లోపాలను సరిదిద్దేందుకు కేంద్ర ఎన్నికల సంఘంపై వత్తిడి తేవాలని సమావేశం నిర్ణయించింది. ప్రభుత్వ దోపిడీ, వైఫల్యాలు, దళితులు, బీసీలు, మైనారిటీలపై జరుగుతున్న దాడులు, ఆయా వర్గాలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రజలను మరింత చైతన్యం చేయాలని, అదే విధంగా పార్టీ చేపట్టిన భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసే విషయమై చర్చించారు.



1). ఇందులో భాగంగా ఎంపీలు, పార్టీ ముఖ్యనేతలు త్వరలో సెంట్రల్ ఎలక్షన్ కమిషన్‌ని కలవాలని నిర్ణయించారు. చనిపోయిన వారి ఓట్లు, డూప్లికేట్ ఓట్ల తొలగింపు కోసం జాతీయస్థాయిలో పోరాటం చేయాలని నిర్ణయించారు.వాలంటీర్ వ్యవస్థ ద్వారా అధికారపార్టీ చేస్తున్న అక్రమాలపై సీఈసీకి ఫిర్యాదు చేయాలని, నియోజకవర్గాల వారీగా అక్రమాలపై నేరుగా సీఈసీకి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. గురువారం జరగబోయే టీడీపీ, జనసేన సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులకు సంబంధించి న్యాయపోరాటానికి పార్టీతరపున న్యాయసహాయం అందించాలని నిర్ణయించారు.

2). ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు 100 రోజుల యాక్షన్‌ప్లాన్‌తో ముందుకెళ్లాలని నిర్ణయించారు. టీడీపీ-జనసేన పార్టీలు నియోజకవర్గ స్థాయిల్లో ఉమ్మడి ఆత్మీయసమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఉమ్మడి మేనిఫెస్టో, ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్లు, వైసీపీ హయాంలో జరుగుతున్న దోపిడీపై ఆయా సమావేశాల్లో చర్చించాలని నిర్ణయించారు. ఇరుపార్టీలు కృష్ణాజలాలు, విద్యుత్ ఛార్జీల పెంపు,కరువు వంటి అంశాలపై నియోజకవర్గ స్థాయిల్లో పోరాడాలని నిర్ణయించారు. అదే విధంగా నిరుద్యోగ సమస్య, విద్యుత్‌ఛార్జీల పెంపు, రోడ్లు, పేదల గృహనిర్మాణంలో అవకతవకలు, నిత్యావసర వస్తువుల ధరల పెంపు, ఇసుక దోపిడీ వంటి అంశాలను మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజల తరపున పోరాడాలి అని నిర్ణయించారు.

3). రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దమనకాండను జాతీయ స్థాయిలో ఎండగడుతూ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. దళితుల ఆత్మ గౌరవాన్ని కాపాడేలా ప్రత్యేకకార్యక్రమంతో పాటు, భారీ దళిత గౌరవ సభ నిర్వహించాలని, ఎస్సీ హక్కుల కోసం పోరాడే వారందరినీ ఈ సమావేశాలకు ఆహ్వానించాలని నిర్ణయించారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో దళితుల హత్యలు, స్కీముల రద్దు, దళితులపై వేధింపులు వంటివాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. నియోజకవర్గ స్థాయిల్లో సమావేశాలు నిర్వహించి చైతన్యం తీసుకురావాలని, ఇందుకోసం త్వరలోనే ఎజెండా, విధివిధానాలు రూపొందించాలని నిర్ణయించారు.

4). జగన్మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు జరిగిన అన్యాయంపై రాష్ట్రవ్యాప్తంగా 25పార్లమెంటు నియోజకవర్గాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని, బీసీ సంఘాలు, తటస్థులను ఈ సమావేశాల్లో భాగస్వాములుగా చేయాలని సమావేశం నిర్ణయించింది. దీంతో పాటు బీసీ సాధికార సమితి సభ్యులంతా సంబంధిత కులాలవారీతో సమావేశాలు నిర్వహించి ఆయా కులాలకు గత నాలుగున్నరేళ్ల జగన్‌పాలనలో జరిగిన అన్యాయంపై చైతన్యవంతం చేయాలని నిర్ణయించారు. ఇప్పటివరకు 5 పార్లమెంటు నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తయ్యాయని మిగిలిన చోట్ల కూడా నిర్వహించాలని నిర్ణయించారు.

5). రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీలకు జరుగుతున్న అన్యాయం,దాడులపై మతపెద్దలు, తటస్థులు, మైనారిటీల హక్కులకోసం పోరాడే సంఘాలతో కలిపి సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు.రాష్ట్రస్థాయిలోని మైనారిటీ ముఖ్యనేతలు నాలుగు బృందాలుగా ఏర్పడి 100రోజుల యాక్షన్ ప్లాన్‌తో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించారు. మైనారిటీలతో సమావేశాలు, బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు.

6). భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమంపై సమావేశంలో చర్చించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుచేసే సంక్షేమ కార్యక్రమాలు, ఒక్కో కుటుంబానికి జరిగే మేలుని వివరిస్తూ రూపొందించిన బాండ్స్‌ని ప్రజలకి అందజేయడం, ప్రజలకు అన్ని సంక్షేమకార్యక్రమాల గురించి వివరించడం లాంటి కార్యక్రమాలు గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించే వారిని గుర్తించి అభినందించాలని నిర్ణయించారు.

## వ్యూహం ట్రైలర్స్‌లో చంద్రబాబు, పవన్‌లను అవమానించిచారు

మంగళగిరి: వ్యూహం సినిమా ట్రైలర్స్‌లో ఉద్దేశపూర్వకంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌లను అవమానించిన ఆ సినిమా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మపై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ రీసెర్చ్, కమ్యూనికేషన్ కమిటీ సభ్యుడు గంగాధర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాబు చెప్పిన అబద్ధాలు, వాళ్ళు ఎలక్షన్ తరువాతే తెలుసుకుంటారు..అని, ఆ స్కిల్ డెవలప్మెంట్ స్కీం లో దోచుకున్న సొమ్ము ఎవరి పాకెట్ లోకి వెళ్ళింది.. అని, అబ్జల్ అమీర్ అనే పేరు గల నటుడి పాత్రతో చెప్పించారని తన ఫిర్యాదులో గంగాధర్ పేర్కొన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను చూపిస్తూ ... ఎప్పుడో ఒకప్పుడు మీరు కళ్యాణ్ కు కూడా వెన్నుపోటు పొడుస్తారుగా.. అని మాటలు వినపడుతుండగా, వాడికంత సీన్ లేదు, తన్ను తానే పొడుచుకుంటాడు.. అని, చంద్రబాబు గొంతును అనుకరిస్తూ, చంద్రబాబు వేషం లో ఉన్న పాత్రదారుడు ట్రైలర్‌లో అంటాడు. ఒక పాట లో పులుల రూపంలో గుంటనక్కలు పొంచి చూస్తున్నాయి.. అనే చరణం వినపడేటప్పుడు చంద్రబాబు నాయుడిని, మగ్గి మాడుతుంది, చెడు మంచి నీడలో, నీతి కరువయ్యింది, అవినీతి పాలనలో వెన్నుపోటు రాజులు.. అనే చరణం వినపడేటప్పుడు చంద్రబాబు నాయుడిని చూపించారు. ఈ విధమైన 3 వీడియోలు సోషల్ మీడియా లో, విడుదల చేసి, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లను, తీవ్రంగా అవమానించారు, సమాజం లో వారి పరువు, ప్రతిష్టలను దిగజార్చారు. తెలుగు దేశం, జనసేనలను, సదరు పార్టీల నాయకులను, కార్యకర్తలను, అభిమానులను కించపరిచి, వారి మనోభావాలను దెబ్బతీసి, వారిని రెచ్చగొట్టి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల లోనే కాక, దేశమంతా, శాంతి, భద్రతలకు విఘాతం కలిగించడానికి ప్రయత్నిస్తున్న " వ్యూహం సినిమా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ పైనా, నిర్మాత దాసరి కిరణ్ కుమార్ పైనా, నటులు అబ్జల్ అమీర్ పైనా, నటి మానసా రాధాకృష్ణన్ పైనా, ఆ సినిమాలో నటించిన మొత్తం నటీ, నటుల పైనా, ఆ సినిమాకు పనిచేసిన 24 క్రాఫ్ట్‌ల సిబ్బంది మొత్తం పైనా ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలంటూ మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో గంగాధర్ ఫిర్యాదు చేసారు.

అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు చేపట్టిన ఉద్యమం 1000 రోజలకు చేరుకుంది. విశాఖ ఉక్కు. ఆంధ్రుల హక్కు. అని నినదించి పలువురి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గని పరిస్థితుల్లో ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని కార్మిక సంఘాలు చేపట్టిన ఉద్యమం బుధవారం నాటికి వెయ్యి రోజులకు చేరుకుంది. కేంద్రం విశాఖ ఉక్కును విక్రయిస్తామని స్పష్టమైన ప్రకటన చేసిన తర్వాత కార్మిక సంఘాలు 2021 ఫిబ్రవరి 12 నుంచి ఐక్య ఉద్యమానికి శ్రీకారం చుట్టాయి. కూర్మన్నపాలెంలో విశాఖ ఉక్కు ఆర్చి వద్ద శిబిరం ఏర్పాటు చేసి 999 రోజులుగా దీక్షలు, ఆందోళనలు చేస్తూనే ఉన్నాయి.

విశాఖ స్టీల్ ప్లాంట్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షకు మద్దతు తెలిపిన ప్రజలకు రాజకీయ నాయకులకు పోరాట కమిటీ ధన్యవాదాలు తెలిపింది. విశాఖలో రాజధాని ఏర్పాటు చేయాలనుకుంటున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అంతకు ముందు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేసింది.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరకు ఉద్యమం ఆగదని కమిటీ స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్ అని, దీనికి సొంత గనులు కేటాయించాలని డిమాండ్‌చేసింది. విశాఖ స్టీల్ ప్లాంట్ వల్ల ప్రత్యక్షం గాను, పరోక్షం గాను సుమారు లక్ష మందికి ఉపాధి కలుగుతుందని, దేశం మొత్తం మీద విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఉన్న సౌకర్యాలు ఏ కర్మాగారానికి లేవని పోరాట కమిటీ పేర్కొంది. దిగుమతులు ఎగుమతులు కోసం రైలుమార్గం, సముద్రపు మార్గం ఉన్నాయని పోరాట కమిటీ పేర్కొంది.

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి దుండగుడి దాడిలో కత్తిపోట్లకు గురైన ఖమ్మం విద్యార్థి వరుణ్‌రాజ్ మంగళవారం కన్నుమూశాడు. గతనెల 26న షికాగోలో దుండగుడి దాడిలో వరుణ్ గాయపడ్డాడు. కత్తిపోట్లకు గురైన అతడిని ఎమర్జెన్సీ సిబ్బంది ఆసుపత్రిలో చేర్చారు.వారం రోజులుగా వెంటిలేటర్‌పై ఉన్న వరుణ్ తాజాగా చనిపోయాడని డాక్టర్లు ప్రకటించారు. కొడుకు మరణవార్త తెలిసి ఖమ్మంలోని వరుణ్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పెద్ద చదువులు చదివి కుటుంబానికి అండగా నిలుస్తాడనుకున్న కొడుకు హఠాన్మరణాన్ని తట్టుకోలేకపోతున్నారు. ఖమ్మంలోని బుర్హాన్ పురంలో నివసించే పుచ్చా రామ్మూర్తి కుమారుడైన వరుణ్‌రాజ్.. ఎంఎస్ చదవడానికి అమెరికా వెళ్లాడు. ఇండియానాలోని వాల్పరైసో యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేస్తున్నాడు. ఈ క్రమంలో అక్టోబర్ 26న జిమ్ నుంచి తిరిగి ఇంటికి వెళుతుండగా వరుణ్‌పై ఓ దుండగుడు దాడిచేశాడు.

కత్తితో పొడవడంతో వరుణ్ అక్కడికక్కడే కుప్పకూలాడు. ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించినా ఉపయోగం లేకుండా పోయింది. కాగా, వరుణ్‌పై దాడికి పాల్పడ్డ వ్యక్తిని ఆండ్రేడ్ జోర్డాన్‌గా గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడికి కారణాలేంటనే వివరాలను తెలుసుకునేందుకు ప్రశ్నిస్తున్నారు.

చైతన్యరథం

# జగన్, సజ్జల అబద్ధాల్లో అందరికంటే ఘనులు

## రాష్ట్రానికి మరలా జగన్ ఎందుకు అవసరమని మండిపడ్డ దేవినేని

**కరువు కాటేస్తుంటే సొంత డబ్బా కొట్టుకుంటున్న సీఎం, మంత్రులు**

**ఇసుక కుంభకోణంలో జగన్ రెడ్డి, సజ్జల, పెద్దిరెడ్డి జైలుకెళ్లడం ఖాయం.**

**జగన్ అసమర్థత వల్లే కృష్ణా జలాల పునఃసమీక్షకు కేంద్రం ఆదేశాలు**



అమరావతి: అబద్ధాలు చెప్పటంలో, విషప్రచారం చేయటంలో జగన్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిని మించినవాళ్లు లేరని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. రాష్ట్రంలో 440 మండలాల్లో కరువు విలయతాండవం చేస్తుంటే ముఖ్యమంత్రి చోద్యం చూస్తున్నాడని విమర్శించారు. రాష్ట్ర రైతాంగం 34 లక్షల ఎకరాల్లో పంటల సాగుకి సృష్టి చెబితే.. వేసిన పంటల్లో దాదాపు 24 లక్షల ఎకరాలు ఎండిపోతే, పక్కరాష్ట్రాలు ఏపీకి రావాల్సిన నీటిని దోచుకుపోతుంటే జగన్‌రెడ్డి, సజ్జల, మంత్రులు సిగ్గులేకుండా సొంతడబ్బా కొట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకు మొత్తం రాష్ట్రమంతా రైతాంగం నీటి ఎద్దడి సమస్యతో ఇబ్బందులు పడుతోందన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రజలపైపన్నులు వేయడం, ధరలు పెంచడం,రాష్ట్రంపై అప్పులభారం, రైతుల మెడలకు ఉరితాళ్లు, మహిళల తాళిబొట్లు తెంచడం.. ఇవీ జగన్‌రెడ్డి సాధించిన ఘనతలు. ఇలా చెబితే చాలానే ఉన్నాయి. విద్యుత్, సాగునీటి రంగాల్లో అవినీతికి తెరలేపి కమీషన్ల కోసం తన బినామీలకు టెండర్లు కట్టబెట్టి,ఆయారంగాలను పూర్తిగా నిర్వీర్యం చేశాడు. రైతులకు రోజుకి నిరంతరాయంగా 7గంటలు కూడా నాణ్యమైన విద్యుత్ అందించలేని దుస్థితిలో ఈప్రభుత్వ ముందని దేవినేని విమర్శించారు.

జగన్‌రెడ్డి ధనదాహానికి..అతను అమ్మిస్తున్న జేబ్రాండ్ కల్తీ మద్యానికి రాష్ట్రంలో 30వేల పేదల ప్రాణాలు పోయాయి.సుమారు 20డిస్టిలరీల్లో కల్తీ మద్యం తయారవుతోంది. మద్యం తయారీ.. సరఫరా.. అమ్మకాలు.. మద్యం అమ్మకాలపై వచ్చే ఆదాయ వివరాలు ఏపీ ప్రభుత్వం బయటపెట్టడంలేదు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం అమ్మేవారంతా వైసీపీ వారే. స్థానిక వైసీపీ ఎమ్మెల్యేలు.. మంత్రుల కనుసన్నల్లోనే మొత్తం మద్యం మాఫియానడుస్తోంది.నాసిరకం మద్యం అమ్ముతున్నా.. బెల్ట్‌షాపులు రేయింబవళ్లు తెరిచి ఉంచుతున్నా కూడా ఎక్సైజ్ అధికారులు ఎక్కడా ఒక్క దుకాణం మూసేసింది లేదని దేవినేని తప్పుబట్టారు.

వెంకటరెడ్డి నెలకు రూ.2కోట్లు కొట్టేస్తూ.. తాడేపల్లి ప్యాలెస్‌కు వేల కోట్లు జమచేస్తున్నాడు. మరో వైపు ఇసుక దోపిడీతో జగన్‌రెడ్డి మొత్తం రాష్ట్రంలోని ఇసుక రీచ్ లన్నింటినీ భారీ గోతులుగా మార్చాడు. ఆఖరికి ప్రజలకు ఉచితంగా ఇసుక అందించినందుకు చంద్రబాబుపై, నాపై, మా మహిళా నాయకురాలు పీతల సుజాత, మరికొందరిపై జగన్‌రెడ్డి తప్పుడు కేసులు పెట్టించాడు. కొత్తఇసుక పాలసీ పేరుతో ముఖ్యమంత్రి తన సోదరుడు అనిల్‌రెడ్డికి, అతని మనుషులకు ఇసుక రీచ్‌లు కట్టబెట్టాడు. గతంలో రీచ్‌లలో తూతూ మంత్రంగా తెల్లకాగితంపై ముద్రించిన దొంగబిల్లుల్ని ఇచ్చేవారు.. ఇప్పుడు అకుపచ్చ రంగు బిల్లులు ఇస్తున్నారు. ఏపీ ఎండీసీ ఎండీ వెంకటరెడ్డి ఇసుక మాఫియాకు సహకరిస్తూ నెలకు రూ.2కోట్లు కొట్టేస్తున్నాడు. తన వంతుగా వేల కోట్ల రూపాయలు తాడేపల్లి ప్యాలెస్ కు అప్పగిస్తున్నాడు. జీఎస్టీ కట్టకుండా.. ప్రభుత్వ అవసరాల ముసుగులో పేదల ఇళ్లకు.. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలకు ఇసుక సరఫరాచేశారు.ఇసుక కుంభకోణం ద్వారానే జగన్ రెడ్డి.. పెద్దిరెడ్డి...సజ్జల అందరూ కలిసి రూ.40వేల కోట్లకు పైగా దోచేశారు. ఈ దోపిడీలో భాగస్వాములైన ప్రతిఒక్కరూ జైలు కెళ్లడం ఖాయమని దేవినేని హెచ్చరించారు.

### జగన్ రెడ్డి గొప్పలు చెబుతున్న డీబీటీ విధానంలో భారీ కుంభకోణం

జగన్‌రెడ్డి గొప్పలు చెబుతున్న డీబీటీ పద్ధతిలో భారీ కుంభకోణం జరుగుతోంది.వైసీపీ వారే...ప్రజల ముసుగులో ప్రభుత్వసొమ్మును మింగేస్తున్నారు.గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారుల ద్వారా ప్రజలకు పథకాలు అందించేది. అంతా ఎక్కడికక్కడ పారదర్శ కంగా జరిగేది. జగన్‌రెడ్డి డీబీటీ పద్ధతిలో లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో వేశామంటున్నాడు. అందులో ఎంత సొమ్ము ప్రజలకు అందిందో, ఎంత సొమ్ము వైసీపీ నేతలు, కార్యకర్తల జేబుల్లోకి వెళ్లిందో ముఖ్యమంత్రి తక్షణమే తేల్చాలని దేవినేని డిమాండ్ చేశారు.

జగన్‌రెడ్డి బస్సుయాత్ర పేరుతో ఊదరగొడుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు నాలుగేళ్లలో పంగనామాలు పెట్టాడు.అయా వర్గాలకు టీడీపీ ప్రభుత్వం అందించిన 120కి పైగా పథకాలు జగన్‌రెడ్డి రద్దుచేశాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంక్షేమానికి వెచ్చించాల్సిన కార్పొరేషన్ల నిధుల్ని జగన్‌రెడ్డి స్వాహా చేశాడు. నాలుగున్నరేళ్లలో జగన్‌రెడ్డి సుమారు 14 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు కొట్టేశాడు. విశాఖ పట్నంలోనే విజయసాయిరెడ్డి నేతృత్వంలో 40వేల ఎకరాలు కొట్టేశారు. విశాఖ పట్నం మహానగరంలో ఖాళీస్థలం కనిపిస్తే వైసీపీ వాళ్లు జెండాలు పాతుతున్నారు. జీవోనెం-3 రద్దుతో ఎస్టీలకు అన్యాయం చేశాడు. దళితులపైనే అట్రాసిటీ కేసులు పెట్టిస్తున్నాడు. అఖరికి రైతులు కష్టపడి పండించిన ధాన్యం కొనుగోళ్ల ముసుగులో వైసీపీ ఎమ్మెల్యేలు... కార్యకర్తలు ఒక్కో బస్తాపై రూ.200 నుంచి రూ.400వరకు కొట్టేశారని దేవినేని ఆరోపించారు.

### జగన్ నోరు తెరవనందునే కృష్ణాజలాలపై పునఃసమీక్షకు ఆదేశాలు

తన చేతగానితనం.. అసమర్థతతో కృష్ణాజలాలపై ఏపీకి ఉన్న హక్కుల్ని కూడా జగన్ ఇతర రాష్ట్రాలకు తాకట్టుపెట్టేశాడు. అపెక్స్ కౌన్సిల్లో జగన్‌రెడ్డి.. అతని ప్రభుత్వం నోరు తెరవనందునే కృష్ణాజలాలపై కేంద్రం పున:సమీక్ష చేయమని ఆదేశాలిచ్చింది. టీడీపీ ప్రభుత్వం 72శాతం నిర్మించిన పోలవరాన్ని జగన్ పండబెట్టాడు.. పట్టిసీమలో అవినీతి జరిగింది.. పంపులు పీకుతానన్నాడు. పట్టిసీమ పంపుల జోలికి వెళ్తే రైతులు జగన్ రెడ్డి వీపులు పగలగొట్టడం ఖాయం. ప్రస్తుత పరిస్థితుల్లో కూడా కృష్ణాడెల్టాలో 10లక్షల ఎకరాలకు నీరు అందటానికి చంద్రబాబు నిర్మించిన పట్టిసీమే కారణం. పట్టిసీమ దండగో.. పండగో జగన్ ఇప్పుడు సమాధానం చెప్పాలి. ఈ చేతగాని ముఖ్యమంత్రి నిర్వాకంతో 120 టీఎంసీలు రావాల్సిన పట్టిసీమ నీళ్లు.. త్వరలోనే 50 టీఎంసీలకు తగ్గిపోనున్నాయి. పోలవరం నిర్వాసితుల్ని గోదావరిలో ముంచి.. జాతీయ ప్రాజెక్టుని పక్కరాష్ట్రానికి తాకట్టు పెట్టాడు. పట్టిసీమ లిఫ్ట్ లోని 24 పంపుల్ని పనిచేయించలేని ఈ చేతగాని జగన్ రెడ్డి రాష్ట్రానికి అవసరమా?అందుకే ప్రజలంతా ఏపీ హేట్స్ జగన్ అంటున్నారు. రాష్ట్రంలోని పంచాయతీలకు నిధులు ఇవ్వకపోవడంతో.. పారిశుధ్యం పడకేసి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. జగన్‌రెడ్డి గొప్పలు చెబుతున్న జగనన్న సురక్ష పథకం పేరుగొప్ప... ఊరు దిబ్బగా మారిందని దేవినేని విమర్శించారు

మరలా రాష్ట్రానికి జగన్ ఎందుకు అవసరం? వివేకానందరెడ్డిని చంపినవారిని కాపాడుతున్నందుకు రాష్ట్రానికి మరలా జగన్ అవసరమా? తన దోపిడీని.. అవినీతిని.. దుర్మార్గపు పాలనను ప్రశ్నించిన మీడియాపై.. ప్రతి పక్షాలపై తప్పుడు కేసులు పెడుతున్నందుకు జగన్ అవసరమా? రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలుచేస్తున్నందుకు జగన్‌రెడ్డి మరలా ప్రజలకు కావాలా? తండ్రి అధికారంతో గతంలో రూ.లక్షకోట్లు.. నాలుగున్నరేళ్ల అధికారంతో రూ.2.50లక్షలకోట్లు కొట్టేసినందుకు రాష్ట్రానికి జగన్ అవసరమా? తన దుర్మార్గపుపాలన..దోపిడీనిప్రశ్నిస్తూ...ఆధారాలతో సహాప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తున్నాడన్న అక్కసుతో చంద్రబాబుని అన్యాయంగా 52 రోజులు జైల్లో పెట్టినందుకు మరలా రాష్ట్రానికి జగన్ కావాలా? ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణలేకుండా చేసినందుకు మరలా జగన్ రాష్ట్రానికి కావాలా? అబద్ధాలు చెప్పడం..విషప్రచారం చేయడం జగన్‌రెడ్డి నైజమని దేవినేని దుయ్యబట్టారు.

### నాడు హిట్లర్ వద్ద గోబెల్స్.. నేడు జగన్ వద్ద సజ్జల

హిట్లర్ హయాంలో అతనివద్ద పనిచేసిన గోబెల్స్‌ను నేడు జగన్ వద్ద పనిచేస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి మించి పోయాడు. దొంగఓట్లతో అధికారంలోకి రావడానికి జగన్‌రెడ్డి.. సజ్జల కొత్త కుట్రలకు తెరలేపారు. వాలంటీర్లు.. సచివాలయ వ్యవస్థని అడ్డం పెట్టుకొని, నకిలీ బ్యాలెట్ పత్రాలు ముద్ర వేయించి.. వాటిని ప్రజలముందు ఉంచి ఓట్లు ఎలా వేయాలో చూపిస్తున్నామంటూ.. ప్రజల్ని భయపెట్టడానికి జగన్‌రెడ్డి సిద్ధమయ్యాడు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులదే. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవని కలెక్టర్లు తెలుసుకోవాలి. రాష్ట్రంలో జరుగుతున్న ఓట్ల అవకతవకలు.. అధికారుల తీరుపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేస్తాం. బ్యాలెట్ పత్రాలు ముద్రేసి.. వాటిని ప్రజలముందు పెట్టి..వైసీపీకి ఓటు వేయకపోతే పథకాలు అపేస్తామని వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది బెదిరిస్తుంటే, కలెక్టర్లు పట్టించుకోరా? జరిగే వ్యవహారమంతా రాజ్యాంగప్రక్రియకు విరుద్ధంగా జరుగుతున్నదే. రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో జరుగుతున్న అవకతవకలు.. దొంగఓట్ల నమోదు అంతా జగన్‌రెడ్డి... సజ్జల రామకృష్ణారెడ్డి.. సీఎంఓ అధికారి ధనుంజయ రెడ్డి పర్యవేక్షణలోనే జరుగుతోంది. ఎన్నికల ప్రక్రియను అపహాస్యంగా మార్చే ప్రక్రియలో జరుగుతున్న చర్యలపై జిల్లా కలెక్టర్లు తక్షణమే స్పందించాలని దేవినేని డిమాండ్ చేశారు.

### తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చిన సీబీఐ నోటీసులపై జగన్ నోరువిప్పాలి

బాబాయ్ హత్యకేసులో తనకు వచ్చిన సీబీఐ నోటీసులపై జగన్ నోరువిప్పాలి. తప్పుడు కేసులతో టీడీపీని..చంద్రబాబుని వేధిస్తున్న జగన్ రెడ్డి ఇంతకు ఇంత మూల్యం చెల్లించుకుంటాడు. జగన్ రెడ్డికి దమ్ము, ధైర్యముంటే మీడియాసాక్షిగా ప్రజల్లోకి వచ్చి జనం ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. రైతుల కళ్లల్లో రక్తం కారుతుంటే జగన్ రెడ్డికి, వ్యవసాయ మంత్రికి కనిపించడంలేదా? ఆర్టీసీని కాపాడలేని.. జగన్ ప్రభుత్వం కూడా ప్రభుత్వమేనా? డ్రైవర్లు.కండక్టర్లను సస్పెండ్ చేయడం కాదు జగన్ రెడ్డి.. నిన్ను, నీ ప్రభుత్వాన్ని ప్రజలు శాశ్వతంగా సస్పెండ్ చేస్తారని దేవినేని ఉమా హెచ్చరించారు.

## - టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్

అమరావతి: నాలుగున్నరేళ్ల జగన్‌రెడ్డి పాలనలో విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించారని,విద్యార్థులకు జరిగిన అన్యాయంపై వారిలో చైతన్యం కలిగిస్తామని తెలుగునాడు విద్యార్థి విభాగం (టీఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మానం ప్రణవ్‌గోపాల్ అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటరీ అధ్యక్షులు, కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ నవంబర్ 18న విద్యార్థీ మేలుకో.. భవిష్యత్ కాపాడుకో కార్యక్రమం పోస్టర్‌ను విడుదలచేసి,నవంబర్ 22నుండి డిసెంబర్ 22 వరకు నెలరోజుల పాటు విద్యార్థులకు జగన్‌రెడ్డి చేసిన మోసంపై వివిధ రూపాల్లో అవగాహన కల్పిస్తామన్నారు. అదేవిధంగా విద్యార్థులకు జగన్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలులో జరిగిన అన్యాయంపై చైతన్యం తెస్తామన్నారు. పాఠశాలలను ప్రయోగశాలలగా మార్చి విద్యార్థుల జీవితాలతో ఆట లాడుతున్నారు. నాణ్యమైన విద్యను దూరం చేశారు. విశ్వ విద్యాలయాలను వైసీపీ కార్యాలయాలుగా మార్చేశారు. మనబడి నాడు నేడు, విద్యా కానుక, బైజూస్ వంటి పథకాలను అడ్డం పెట్టుకొని దోచుకుంటున్నారు. పీజీ విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌ను రద్దు చేశారు. విదేశీ విద్య, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌ను నిర్వీర్యం చేశారు. ఇటువంటి పథకాలను పట్టించుకోక పోవడంతో బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ విద్యార్థులకు విద్యను దూరం చేశారు. విద్యార్థి లోకానికి జగన్‌రెడ్డి చేసిన మోసాలపై డిసెంబర్ 7న రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తామన్నారు. అంతే కాకుండా అనేక అవగాహన ర్యాలీలు, సదస్సులు, సమావేశాలు నిర్వహించి విద్యార్థులం దరిని ఏకతాటిపై తెస్తామన్నారు. ప్రత్యేక హెూదా అంటూ విద్యార్థులను రెచ్చగొట్టి తీరా అధికారంలోకి వచ్చాక మాట తప్పి మాదమ తిప్పారు. రాబోయే రోజుల్లో అదే విద్యార్థులు.. జగన్‌రెడ్డిని ఇంటికి పంపించడం ఖాయమన్నారు.



### పాల వెల్లువ కాదు.. పాపాల వెల్లువ

**సీబీఐ విచారణకు సిద్ధమా అని జగన్‌కు నాదెండ్ల సవాల్**

అమరావతి: జగనన్న పాలవెల్లువ పథకంలో అవకతవకలపై సీబీఐ విచారణకు సిద్ధమా అని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ సవాల్ విసిరారు. మంగళగిరిలోని జనసేనపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రులు ఎవరైనా క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తే అక్రమాలు తెలుస్తాయన్నారు. నవంబరు 14 నుంచి జగన్ సర్కారు పథకాల్లోని అవినీతిని రోజుకొకటి చొప్పున బయటపెడతామని ప్రకటించారు. నిజంగా రూ.2,350 కోట్లు ఖర్చు చేసి 3.94 లక్షల పాడి పశువులు కొనుగోలు చేసి ఉంటే..కేవలం 2.70లక్షల లీటర్ల పాలు మాత్రమే ఎందుకు సేకరిస్తున్నారని ప్రశ్నించారు. మిగతా 15.76 లక్షల లీటర్ల పాలు ఎక్కడికి పోయాయని నిలదీశారు. జగనన్న పాలవెల్లువ పేరుతో భారీ దోపిడీ జరిగిందని ఆరోపించారు. అది పాలవెల్లువ కాదని.. పాపాల పుట్ట అని విమర్శలు గుప్పించారు. పశువుల కొనుగోళ్లకు బ్యాంకులు రుణాలు ఇస్తే వివరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాడి పశువులను రీసైక్లింగ్ చేసినట్లు ప్రభుత్వమే చెప్పిందన్నారు.

మమ్మల్ని మన్నించండి బాబు గారు.

2014-2019 మధ్య ఏపీ సిఎంగా చంద్రబాబు నాయుడు గారు ఐదు కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజల శ్రేయస్సు కోసం, బిడ్డల బంగారు భవిష్యత్ కోసం, భావితరల జీవితాల్లో సంతోషం నెలకొల్పడానికి చేసిన కొన్ని మంచి పనులు.



# మమ్మల్ని మన్నించండి బాబు గారు..!

తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో టిడిపి అధినేత ఎన్.చంద్రబాబునాయుడు ప్రతి గంట, ప్రతి నిమిషం, ప్రతి సెకండ్ ప్రజల కోసమే పరిశ్రమించారు. అటు ఉమ్మడి రాష్ట్రాన్ని, ఇటు రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించారు. తెలుగు ప్రజల బిడ్డలకు మంచి భవిష్యత్తును అందించారు. అటువంటి నేతను అక్రమంగా అరెస్ట్ చేసి జగన్ రెడ్డి ప్రభుత్వం 52 రోజుల పాటు జైల్లో పెట్టి ఇబ్బందులుకు గురిచేసింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు చేసిన అనేక మంచి పనులను అనేక మంది నెమరవేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం, మా పిల్లల భవిష్యత్ కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన నిన్ను ఓడించి తప్పు చేశామంటూ చాలా మంది పశ్చాతప పడుతున్నారు. ముఖ్యంగా 2014-19 మధ్య కాలంలో విభజిత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సీమాంధ్ర స్వరూపాన్నే మార్చేసిన ఆయన విజన్, విధానాలు, కృషి గురించి శ్రీనివాస్ నాయుడు అనే ఒక సామాన్యుడు "మమ్మల్ని మన్నించండి బాబుగారు" అంటూ ఒక ఆన్‌లైన్ బుక్‌ను తయారు చేశారు. రాష్ట్రంలో నాటి, నేటి పరిస్థితిని గమనించి కలత చెందిన విశాఖ పట్నానికి చెందిన ఈయన ఈ సంకలనాన్ని ప్రజల ముందుకు తీసుకువచ్చారు. ఆ బుక్‌లోని వివరాలు మీకోసం వరుస రోజుల్లో అందిస్తున్నాం...

మమ్మల్ని మన్నించండి బాబు గారు.

47. రాష్ట్రంలో రౌడీయిజాన్ని అంతం చేశారు, గుండాలను, ఫ్యాక్షనిస్టులులను, అసాంఘిక శక్తులను తొక్కి పెట్టి నార తీశారు ,తద్వారా ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు శాంతి భద్రతలు కలిపించారు.




మమ్మల్ని మన్నించండి బాబు గారు.

48. పేదింటి ఆడ పిల్లలకు పెళ్లి కానుక అందించి అండగా నిలబడ్డారు.




మమ్మల్ని మన్నించండి బాబు గారు.

49. పుట్టిన బిడ్డలు అందరికి బేబీ కిట్లు ఇచ్చారు, తల్లుల కోసం తల్లి బిడ్డా ఎక్స్‌ప్రెస్ ప్రారంభించారు.






మమ్మల్ని మన్నించండి బాబు గారు.

గత 28 ఏళ్లుగా నిముషంలో 60 సెకండ్లు, గంటలో 60 నిముషాలు, రోజులో 24 గంటలు, వారానికి ఏడూ రోజులు, నెలలో 30 రోజులు, ఏడాదిలో 365 రోజులు తెలుగుప్రజల కోసం అలుపు లేకుండా కష్టపడి వందల వేల, కార్యక్రమాలు చేపట్టి కోట్లాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మీకు దక్కిన బహుమానం.












మమ్మల్ని మన్నించండి బాబు గారు.

2014-2019 మధ్య ఏపీ సిఎంగా చంద్రబాబు నాయుడు గారు ఐదు కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజల శ్రేయస్సు కోసం, బిడ్డల బంగారు భవిష్యత్ కోసం, భావితరల జీవితాల్లో సంతోషం నెలకొల్పడానికి చేసిన కొన్ని మంచి పనులు.



# వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం: కోండ్రు

రాజాం చైతన్యరథం: వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ కోండ్రు మురళీమోహన్ అన్నారు. రాజాంలోని శ్యాంపురం తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో కోండ్రు ఆధ్వర్యంలో వంగర మండలం తలగాం గ్రామానికి చెందిన 30 వైసీపీ దళిత కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి కండువాలు వేశారు.రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలకు సీఎం జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న మోసాలకు కుంటిపడిన రాష్ట్రాభివృద్ధి కి నిరసన వ్యక్తం చేస్తూ పార్టీలో చేరినట్లు తెలిపారు.అనంతరం కోండ్రు మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం ప్రజాకంటకంగా మారిందన్నారు. గ్రామీణ ప్రాంతాలు పూర్తిగా అస్తవ్యస్తం అయ్యాయన్నారు.సీఎం జగన్ మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ళ పాలనలో 70 వేల కోట్లు ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకున్నారని ఆరోపించారు.విశాఖలో కోట్ల రూపాయల విలువచేసే భూములు వైసీపీ నేతలు మింగేస్తున్నారన్నారు. రాష్ట్ర సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే చంద్రబాబుపై అక్రమ కేసులు నమోదు చెయ్యడం హేయమైన చర్య అన్నారు. వైసీపీ ప్రభుత్వం పతనావస్థకు చేరుకోవడంతో సీఎం జగన్ ఇలాంటి పైసాచిక ఆనందం పొందుతున్నారని అన్నారు.

వైసీపీ ప్రభుత్వం పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం రంగం అభివృద్ధి చెందకపోవడం, మౌలిక సదుపాయాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తయారుచేశారని దుయ్యబట్టారు. అడ్డగోలుగా నిత్యావసర ధరలు, ఇసుకమాఫియా, రాష్ట్రంలో తీవ్రమైన తాగునీటి సమస్య, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన ఆర్థిక సంస్కరణలు విద్యుత్ సంస్కరణలు దేశానికి నూతన మార్గ నిర్దేశనం చెయ్యటమే కాకుండా చంద్రబాబు నోట ముందుగా వచ్చిన సంపద సృష్టి అన్న పదం రాజకీయ నేతలనే కాదు ఆర్థికవేత్తలను. పారిశ్రామికవేత్తలను సైతం ఆకర్షించచిందన్నారు. ఈ వైసీపీ ప్రభుత్వం పాలనలో రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు రాక.స్వయం ఉపాధికి ప్రభుత్వం నుంచి సహకారం అందక రాష్ట్ర భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. వైసీపీ పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ముఖ్యమంత్రి జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం కమీషన్ల కక్కుర్తితో 17 లక్షల కోట్ల పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు తరిమేసారన్నారు. జగన్ రెడ్డి ఐటి కంపెనీలు తరిమేసి అక్రమ కేసులతో స్కిల్ డెవలప్మెంట్‌ని నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పోరేషన్ల యువతకు సబ్సిడీ బ్యాంకు రుణాలతో స్వయం ఉపాధి కల్పిస్తే జగన్ రెడ్డి రద్దు చేసి నిరుద్యోగుల పొట్ట కొట్టారని ఘాటుగా విమర్శించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్ర సంక్షేమం అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వంగర మండలం పార్టీ అధ్యక్షులు పిన్నింటి మోహన రావు, దూబ ధర్మారావు, గురవాన నారాయణ రావు, మజ్జి గణపతి, బెజ్జిపురపు రవి, ఆవు తిరుపతి, చింతా అప్పల నాయుడు, బి ముకుందా,పి రాంబాబు దళిత వాడకు చెందిన వద్ది చంటి తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



తిరుపతి చైతన్యరథం: జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాకుంటే పోరాటాలు తప్పవని తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల పాదయాత్రలో నిరుద్యోగులకు మేనమామగా నిలబడి రాష్ట్రంలో 2లక్షల 35వేల ఉద్యోగాలు భర్తీ చేసి కుటుంబాలను ఆదుకుంటానని మాట ఇచ్చిన ప్రస్తుత సీఎం జగన్మోహన్ రెడ్డి నాడు చెప్పిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని, నవంబర్ 9వ తేదీ గురువారం నుండి స్టేట్‌లోని అన్ని నియోజకవర్గాలలో నిరసనలను కొనసాగిస్తామని. తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు తెలియజేశారు. ప్రెస్ క్లబ్లో బుధవారం మీడియా ముందు తెలుగు యువత బి.కృష్ణ యాదవ్ దిలీప్ రాయల్ రంజిత్ తదితరులతో కలిసి రవి మాట్లాడుతు (జాబ్ క్యాలెండర్ )అమలు చేయకపోవడంపై యూత్ కోర్టుకు వేశారన్నారు. ఎన్నికలు నాలుగు నెలలు ఉండగాజాబ్ నోటిఫికేషన్ విడుదల చేయడం ఓట్ల రాజకీయంగా రవి అభివర్ణించారు. చదువుకోవడమే పాపమా వైసీపీకి ఓటు వేయడమే తమ శాపమా అంటూ నిరుద్యోగుల్ని ఫ్యాన్ పార్టీ గొంతు కోసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

రామచంద్రపురం చైతన్యరథం: టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి జరుగుతుందని రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు తెలిపారు. రామచంద్రపురం మండలం కేంద్రమైన ఆదివారపుపేట గ్రామంలో బుధవారం "బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ " కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి పథకాలు నమోదు చేసి, కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించి మినీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాల గురించి, రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి జరగబోయే లబ్ధి గురించి సవివరంగా వివరించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఉచితం, అన్నదాత పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి 20 వేల రూపాయుల ఆర్థిక సాయం, యువగళం నిధి నెలకు 3000 రూపాయులు ఆర్థిక సాయం, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికి కుళాయి కనెక్షన్లు, ఐదేళ్లలో పేదల ఆదాయం రెట్టింపు



పేదలను సంపన్నులు చేయటమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివారపు పేట గ్రామ పార్టీ నాయకులు, మండల, పట్టణ, గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, క్లస్టర్ ఇన్ ఛార్జ్, యూనిట్ ఇన్‌ఛార్జ్, మహిళలు, యువత, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.




గుంటూరు (చైతన్యరథం): టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్ పై టీవీ-9 రజినీకాంత్ పెట్టిన అక్రమ కేసును నిరసిస్తూ టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు కోడూరి అఖిల్ ఫిర్యాదు చేశారు. గతంలో టీవీ-9 తెలుగు న్యూస్ ఛానల్ ప్రజలపక్షాన నిలిచి, ప్రజల గొంతుకగా మారితే, నేడు జగన్ రెడ్డి గొంతుకగా పనిచేస్తోంది. 2019లో ముఖ్యమంత్రి అయిన వెంటనే జగన్ రెడ్డి పనితనం.. ఆయన ప్రభుత్వ పనితీరు నెలరోజుల్లోనే ఏపీప్రజలకు అర్థమైంది. ప్రజలు గ్రహించిన వాస్తవాల లోతుల్లోకి వెళ్లి ప్రజల మనస్సాక్షిగా మారాల్సిన టీవీ-9 ఛానల్ సాక్షి-2 గా మారింది. ఏపీలో అధికారం తనకే వచ్చినట్టు ఫీలైపోయిన రజనీకాంత్.. వైసీపీ పెంపుడు కుక్కలకంటే అధికంగా ప్రజలపైనే మొరగడం మొదలెట్టాడు. జగన్ అవినీతి ఛానల్, విషపు పత్రిక సాక్షిలో వైఎస్ చిత్రం కనిపిస్తుంది. సాక్షి మీడియా వాస్తవాలను కప్పిపుచ్చి ప్రజల్ని ఏమార్చేలా దుష్ప్రచారం చేయడంలో మంచి పేరుప్రఖ్యాతులు పొందిందనే నిజం ప్రపంచానికే అర్థమైంది. మంచిని దాచి చెడుని ప్రచారం చేయడం.. జగన్ రెడ్డి దుర్మార్గాలు దాచి, అతనో గొప్ప నాయకుడన్నట్టు చిత్రీకరించడంలో సాక్షి మీడియా రాటు తేలిపోయింది. అలాంటి సాక్షి మీడియాకు తామేమీ తీసి పోము.. సాక్షికంటే రెండాకులు ఎక్కువే చదివాము అన్నట్టు టీవీ-9 వ్యవహరిస్తోంది.



అర్ధవీడు చైతన్యరథం: రాష్ట్రంలో రైతుల పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి రైతులు పంట నష్టాలతో అతలాకుతలం అవుతుంటే మొద్దు నిద్ర పోతున్నాడని గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల వైసీపీ సర్కార్‌పై ధ్వజమెత్తారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమంలో భాగంగా అర్ధవీడు మండలం, నాగులవరం గ్రామంలో పర్యటించిన అశోక్ రెడ్డి ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన మినీ మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సరైన వర్షాలు లేక రైతులు అష్ట కష్టాల పాలవుతున్నారని రైతులకు మేలు చేస్తాం సంక్షేమాన్ని అందిస్తామని కేవలం బహిరంగ సభల్లో ప్రగల్భాలు పలుకుతున్న వైసిపి పాలకులు రైతన్నలు పంట నష్టాలతో కన్నీరు పెడుతుంటే ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. గిద్దలూరు నియోజకవర్గంలో 36 వేల ఎకరాల్లో రైతులు పంట నష్టపోతే ఏ ఒక్క రైతును కూడా ఈ ప్రభుత్వం ఆదుకోలేదని రైతుల ద్రోహి జగన్ రెడ్డి అని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వెంటనే వారికీ నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు సంక్షేమాన్ని అందించింది తెలుగుదేశం ప్రభుత్వం అని, రైతులను అన్నీ విధాలుగా ఆదుకున్నది చంద్రబాబు నాయుడు గారు అని, రానున్న ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలిచి రైతు వ్యతిరేక వైసీపీ ప్రభుత్వానికి తమ ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలన్నారు.

సీయం జగన్ రెడ్డి బతుకు అంతా అబద్ధాలు, అక్కస్సే, ఆ రెండూ లేకపోతె జగన్‌కి బతుకే లేదు. అందుకే బటన్ నొక్కుడు సభల్లో అబద్ధాలు చెప్పడం, చంద్రబాబుపై అక్కసు వెళ్ళకక్కడం అతని నైజంగా మారింది. నాలుగున్నరేళ్ల పాలన తర్వాత ఎటువంటి చేతకాని అసమర్థ ముఖ్యమంత్రి కి అయినా ఏదో ఒకటి చేసింది చెప్పుకోవడానికి ఉంటుంది. కానీ ఈ గతి మాలిన ముఖ్యమంత్రి కి చెప్పుకోవడానికి ఒక్క మంచి పనిలేదు. అన్ని విడిచేసిన వాడు సిగ్గు ఎరుగడట. ఆ విధంగానే నగ్నంగా బరితెగించి అబద్ధాలు అడుతున్నాడు. ఐదేళ్లతో అన్నం తింటున్నాడో, అబద్ధాలు తింటున్నాడో అర్థం కావడం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లా పుట్టపర్తిలో రైతు భరోసా నిధులకు బటన్ నొక్కుడు సభలో మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో వానల్లేక రాష్ట్ర రైతాంగం కరువు కోరల్లో చిక్కుకొని అన్నదాత అంపశయంపై ఉంటే అక్కడక్కడ కొంచెం కరువు ఉంది అంటూ జగన్ మాట్లాడం అంటే జగన్‌కి కళ్ళు, చెవులు ఉన్నాయా అన్న అనుమానం వస్తుంది. మళ్ళీ ఏమంటాడు అంటే కరువు రావడం మన చేతుల్లో లేదు కదా అంటూ సుద్దులు చెబుతూనే, చంద్రబాబు హయాంలో నాలుగేళ్ళ కరువుందంటూ అక్కసు వెళ్లగక్కడం ఆయన నీచ బుద్ధికి నిదర్శనం. అప్పుడు కరువు చంద్రబాబు చేతుల్లో ఉందా? ప్రకృతిని కూడా చంద్రబాబుకి చుట్టిన ఘనుడు జగన్. రాష్ట్ర రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకున్న ఘనత తనదేనంటూ డప్పు కొట్టుకున్నారు తప్ప ఈ ఏడాది ఖరీఫ్‌లో కరువు బారిన పడి పంట నష్టపోయిన రైతులను ఎలా ఆదుకుంటారో మాత్రం చెప్పలేదు. ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.13,500 రైతు భరోసా సాయమందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.6వేలు కూడా తానే ఇస్తున్నట్లు అబద్దాలు చెబుతూ కూడా, అబద్దాలు చెప్పడం,మోసం చెయ్యడమే రాదన్నారు. కరువు బారిన పడి బీడుగా మారిన పొలాలు,ఎండి పోతున్న పంటలు, పెట్టుబడికి తెచ్చిన అప్పులు తలుచుకొని రైతుల గుండె మండుతుంటే రైతుల ముఖంలో చిక్కటి చిరునవ్వులు చెరగని ప్రేమాభిమానాలు కనిపిస్తున్నాయని చెప్పడం పిచ్చి తుగ్లక్ జగన్ రెడ్డికే సాధ్యం అని అర్థం అవుతుంది. ఒక పక్కన కరంటు ఇవ్వడం లేదని పంటలు ఎండి పోతున్నాయని రైతులు ఆందోళన చేస్తుంటే పగటి పూటే 9 గంటలు కరంటు ఇస్తున్నామని పచ్చి అబద్దాలు చెప్పి అన్నం పెట్టె అన్నదాతను మోసం చేశారు. కరువు వల్ల ఖరీఫ్‌లో 30లక్షల ఎకరాల్లో పంటలు వెయ్యక పోవడం, 400 మండలాల్లో కరువు ఉంటే, రాయలసీమలో ఊళ్లకు,ఊళ్లు వలసలు పోతుంటే కరువు లేదని అబద్దాలు చెప్పడం అంటే రైతుల పట్ల ఎంత బాధ్యత వున్నదో రైతులే అర్థం చేసుకోవాలి.

రైతు బతుకు జగన్ పాలనలో గాలిలో దీపమయ్యింది. అంకెల గారడీలతో,అబద్దాలతో రైతులను మోసం చేస్తున్నారు.రైతుల పేరుతొ రాజకీయ డ్రామాలు రక్తి కట్టించడంలో జగన్ అభినవ నటుడు. మాయ భరోసాతో అరకొరగా రైతు భరోసా ఇచ్చి సమస్త రైతు సమస్యలు పరిష్కరించినట్లు పత్రికల్లో ప్రకటనలు గుప్పిస్తూ, అంకెలగారడీలతో, అబద్దాలతో రైతులను తప్పుదారి పట్టిస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 79,50,844 మంది రైతు ఖాతాలుండగా, 53 లక్షల మందినే రైతు బరోసాకు అర్హులుగా గుర్తించారు. రైతు భరోసా కింద మొత్తం రాష్ట్ర ప్రభుత్వం నిధులు నుంచే రూ.12,500 ఒకే సారి మే నెలలో ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించారు. రూ.12,500 రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాల్సి వుండగా దానికి కేంద్రం ఇస్తానన్న రూ.6000 కలిపి రూ18,500 రైతుకి ఇవాల్సి వుంది. కానీ కేంద్రం ఇచ్చే రూ.6000లకు, జగన్ ప్రభుత్వం రూ 7,500 కలిపి రూ.13,500 ఇస్తున్నారు.ప్రతి రైతు కుటుంబానికి ఐదేళ్లలో రూ.50వేల వరకు లబ్ధి చేకూరుస్తామని మేనిఫెస్టోలో తెలిపి. రూ.37,500 మాత్రమే ఇస్తూ. రూ.67,500 ఇస్తున్నట్లు రైతులను మోసం చేస్తున్నారు. ఒకే విడతలో రైతు భరోసా పూర్తిచేస్తామని చెప్పి ఇప్పుడు తానూ ఇచ్చే రూ.7,500 కూడా మూడు విడతలుగా రైతులకు ముష్టి వేస్తున్నారు,కౌలు రైతులు 15.36 లక్షల మంది ఉండగా లక్షమందికి కుదించి రైతులను కులాల వారీగా విడదీసి రైతు భరోసా పథకంలో అగ్రకులాల పెద రైతులకు అన్యాయం చేసారు. గడిచిన నాలుగన్నరేళ్లలో రైతులకు రూ.1.75 లక్షల కోట్లు ఉచితంగా ఇచ్చినట్లు పచ్చి అబద్దాలతో రూ.కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి సొంత మీడియాకు తప్పుడు ప్రకటనలు ఇచ్చి రైతులను మభ్యపెడుతున్నారు. ధాన్యం, ఇతర పంటల కొనుగోళ్లు ద్వారా రూ.67,596 కోట్లు రైతులకు ఉచితంగా ఇచ్చినట్లు ప్రకటనలు ఇవ్వడం దారుణం. రైతుల నుంచి కొన్న ధాన్యాన్ని ఎఫ్‌సీఐకు విక్రయించి డబ్బులు తీసుకోనట్లు రైతులను తప్పు దారి పట్టిస్తున్నారు. రైతు భరోసా కింద ఇప్పటికి రూ.33,210 కోట్లు ఇస్తే అందులో నిధులు రూ.15 వేలు కోట్లు కేంద్ర ప్రభుత్వానివే. కేంద్రం ఇచ్చిన నిధులను తాన ఖాతాలో వేసుకొని తానూ ఇచ్చినట్లు రైతులను మోసం చేస్తున్నారు. 470 మండలాల్లో దారుణ పరిస్థితులు ఉంటే, కేవలం 107 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకోవడం రైతుల పట్ల ప్రేమ ఎంత ఉందొ అర్థం అవుతుంది.

నాలుగున్నరేళ్లలో రూ.1,75కోట్లు ఖర్చు చేస్తే వ్యవసాయం రంగం ఎందుకు ఇంత సంక్షోభంలోకి నెట్టబడింది? రైతు ఆత్మహత్యలు ఎందుకు పెరిగాయి? అప్పుల ఊబిలో రైతులు ఎందుకు కూరుకు పోయారు? ఆహారధాన్యాల ఉత్పత్తి ఎందుకు పతనమైంది?2017-18లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 167లక్షల టన్నులుంటే, 2022-23నాటికి 163.32లక్షల టన్నులకు ఎందుకు పడిపోయింది? నాలుగేళ్ల తర్వాత కూడా 4 లక్షల టన్నులు తగ్గడం మీ వైఫల్యం కాదా?ఆహార ధాన్యాల ఉత్పత్తి వృద్ధిరేటు మైనస్ 2.53%కు ఎందుకు పడిపోయింది?వ్యవసాయ రంగాన్ని తిరోగమనంలోకి నెట్టిన వాస్తవాలు ఇలా ఉంటే, ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరిగిందని చెప్పడం అబద్ధం కాదా ?ధాన్యం ఉత్పత్తి గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లలో సగటున హెక్టారుకు 4,904కిలోలు ఉత్పత్తి రాగా,జగన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో సగటు 4,588 కిలోలు మాత్రమే వచ్చింది. అంటే 316 కిలోల ఉత్పత్తి తగ్గడం మీ ఘనతనా? మీ పాలనలో వేరుశనగ ఉత్పత్తి కూడా హెక్టారుకు సగటున 187కిలోలు ఎందుకు తగ్గింది? ధాన్యం, వేరుశనగే కాదు మిగిలిన ఆహారధాన్యాల ఉత్పత్తి అంతే వుంది. కేంద్రం అమలుచేసే రైతాంగ పథకాలు అమలులో, అర్.బి.కె, రైతుభరోసాలో అన్నీసకలం వైఫల్యాలే.

రైతులను జగన్ ప్రభుత్వం ఏ విధంగా మోసం చేస్తున్నదో రైతులు కూడా అర్థం చేసుకోవాలి.పంట వేసిన రైతుల గిట్టుబాటు ధర ఇవ్వడం కోసం ధరల స్థిరీకరణ నిధి పేరుతో బడ్జెట్‌లో రూ.3000 కోట్లు, ప్రకృతి, విపత్తులు వచ్చినప్పుడు ఆదుకోవడానికి రూ.4000 కోట్లు కేటాయిస్తానని మోసం చేశారు. అదనపు అప్పుల కోసం వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించి రైతుల మెడకు వురి బిగిస్తున్నారు. ఆక్వా రైతులకు విద్యుత్తు సబ్సిడీ ఇస్తామని ఇవ్వక పోగా పెంచి అక్వారంగాన్ని సంక్షోభంలోకి నేట్టారు. పాడి రైతులకు లీటరు పాలకు 4రూపాయలు బోనస్ ఇస్తామని ఎగనామం పెట్టారు. రైతులకు వడ్డీలేని రుణాలు ఇస్తామని బులిపించి పట్టి చేతులు చూపించారు. వైఎస్సార్ జలకళ పేరుతో ఉచిత బోర్లు వేయిస్తామని, ఆర్భాటంగా ప్రారంభించిన వైఎస్సార్ జలకళను అటకెక్కించారు. వ్యవసాయ యాంత్రీకరణకు మంగళం పాదారు. గత ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ పథకం కింద చిన్న, సన్న కారు రైతులకు 90 శాతం రాయితీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీ అందించిన పథకాన్నిజగన్ ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని పూర్తిగా రద్దు చేశారు. ఉచితంగా అందించే సూక్ష్మ పోషకాలు, మైక్రో న్యూట్రియంట్స్ ఎరువులు పంపిణీని సైతం నిలిపేశారు.గత ప్రభుత్వం రైతు ఋణమాఫీ కింద 58.29 లక్షల మంది రైతులకు రూ.15,279 కోట్లు రుణమాఫీ చేసి ఆదుకుంది. జగన్ అధికారంలోకి వచ్చి గత ప్రభుత్వం చెల్లించాల్సిన, 4-5 విడతల రైతు ఋణ మాఫీ పథకాన్నిరద్దు చేసి రైతుల ప్రయోజనాలకు గండి కొట్టారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ లో 93.2 శాతం రైతు కుటుంభాలు అప్పుల్లో కూరుకు పోయాయని, ఒక్కో కుటుంబంపై సగటున రూ.2,45,554లు అప్పున్నట్లు ఓ నివేదిక వెలువడింది. కానీ జగన్ ప్రభుత్వం మాత్రం రాష్ట్రంలో వ్యవసాయం బ్రహ్మాండమంటూ పత్రికల్లో ప్రకటనలిస్తూ రైతుల్ని మభ్య పెడుతున్నారు. జగన్ రెడ్డి జమానాలో 3,500మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. దేశంలో రైతు ఆత్మ హత్యల్లో ఆంధ్రప్రదేశ్ 3వ స్థానంలో నిలిచింది. కౌలు రైతుల ఆత్మ హత్యల్లో దేశంలో 2వ స్థానంలో నిలిచింది. అన్నదాతల మృత్యు ఘోష కొనసాగుతూనేవుంది. పల్నాడు, రాయలసీమ వంటి ప్రాంతాల్లో నిత్యం అన్నదాతలు ఆత్మహత్య చేసుకోవడం ప్రభుత్వ వైఫల్యానికి దర్పణం పడుతోంది.

అంతే కాదు వ్యవసాయం దాని అనుబంధ రంగాలన్నింటినీ అధోగతి పాలు చేసారు.నాలుగేళ్ల వృద్ధి రేట్లే అందుకు సాక్ష్యాలు.(స్థిరధరల ప్రకారం) వ్యవసాయంలో వృద్ధి తెలుగుదేశం హయాం నాలుగేళ్లలో 11.2% ఉంటే, వైసిపి హయాంలో 6.01%కు దిగజారింది.అంటే దాదాపు సగానికి వృద్ధిరేటు పతనమైంది.పశుసంవర్ధకంలో గత ప్రభుత్వ హయాంలో వృద్ధి 13% ఉంటే వైసీపీ నాలుగేళ్లలో 5.9%కు పడిపోయింది. లైవ్ స్టాక్ గ్రోత్ రేటు 7.1% దిగజార్చారు. ఉద్యాన రంగంలో గత నాలుగేళ్ల హయాంలో వృద్ధి 12.9% ఉంటే, జగన్ సిఎం అయ్యాక ఈ నాలుగేళ్లలో 6.1%కు పతనం అయింది. అంటే హార్టీకల్చర్ లో వృద్ధి మైనస్ 6.8%.గత ప్రభుత్వం హయాంలో ఆక్వా కల్చర్ వృద్ధి 28.9% ఉంటే, వైసిపి నాలుగేళ్లలో 9.2%కు దిగజారింది. అక్వాలో గ్రోత్ ను మైనస్ 19.7%కు పతనం చేశారు. మూడోవంతుకు దిగజార్చిన ఘనత కూడా సిఎం జగన్ దే. (ఇవన్నీ ప్రభుత్వ నివేదికల ప్రకారమే) హోల్ సేల్ ప్రైస్ ఇండెక్స్ కూడా 10%నుంచి 4%కు పతనమైంది. అందుకే రైతులకు గిట్టుబాటు ధరలు అందని దుస్థితి నెలకొంది.రూ 4వేల కోట్ల స్థిరీకరణ నిధి, రూ 4వేల కోట్ల విపత్తు సహాయ నిధి ఎగ్గొట్టారు. అయినా అబద్దాలకు,బడాయికి కొదవ రానివ్వడం లేదు జగన్ రెడ్డి.వాస్తవాలు ఇలా వుంటే రైతులను తాను ఉద్దరించినట్లు అబద్దాలు చెప్పడం సిగ్గుచేటు.ఇది నయవంచన, నమ్మకద్రోహం కాక మరేమిటి? అన్నదాతకు అరచేతిలో వైకుంటం చూపి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి పాలనలోరైతు బతుకు గాలిలో దీపమైంది.విత్తనం వేసిన దగ్గర నుండి ఉత్పత్తులు మార్కెట్‌లో అమ్ముకోనే దాకా ప్రతి దశలోనూ రైతులను చెయ్యి పట్టి నడిపిస్తానని బులిపించి అధికారంలోకి వచ్చిన జగన్ జమానా లో రైతులకు చేసిన సాయం కంటే చేసిన వంచనలే ఎక్కువని చెప్పాలి.

అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రప్రదేశ్ లో రైతులు క్రాఫ్ హాలిడే ప్రకటించడం రాష్ట్రం లో సాగు సంక్షోభానికి నిదర్శనం.వ్యవసాయ రంగానికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నాం అంటూ పెద్ద ఎత్తున ప్రకటనలు ఇస్తున్నా ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది రైతుల దుస్థితి.ఒక పక్కన సాగు సంక్షోభం పెరిగిపోతుంటే, రైతులు అప్పుల భారంతో కుప్పకూలుతుంటే, మరో పక్క ప్రభుత్వం వ్యవసాయాన్ని పండగ చేసాం,మాది రైతు పక్ష పాత ప్రభుత్వం అని సొంత పత్రికలో బాకాలుదుకొంటున్నారు. మీ పాలనలో సాగు బ్రాహ్మాండం అని చెప్పుకోవడం ఆత్మవంచనే అవుతుంది.రైతుల పట్ల చిలక పలుకులు కాదు.జగన్ రెడ్డి అసమర్థ పాలనలో రైతు లోగిళ్ళలో చీకట్లు అలుము కొన్నాయి. రైతులు గురించి జగన్ చెప్పేది కొండంత చేసింది కొండంత అని రైతు సోదరులు తెలుసుకోవాలి.

# రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టేందుకే

## ఈ ప్రభుత్వం బస్సు యాత్ర చేపట్టింది!

ఆళ్లగడ్డ చైతన్యరథం: రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టేందుకే ఈ ప్రభుత్వం బస్సు యాత్రను చేపట్టిందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ మండిపడ్డారు. ఆళ్లగడ్డ మండలంలోని నల్లగట్ల గ్రామంలో భవిష్యత్తు కు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. బుధవారం నల్లగట్ల గ్రామంలో మాజీ మంత్రి అఖిలప్రియ ఇంటింటికి వెళ్లి టిడిపి పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించి నేటి ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న భారాన్ని వివరిస్తూ రాబోయే 2024లో టీడీపీని ఆదరించి గెలిపించాలని ఆమె కోరారు. ఎస్సీ ఎస్టీ బీసీలు ఈ ప్రభు త్వంలో ఎక్కడ అభివృద్ధి చెందలేదన్నారు. కేవలం ఉనికిని చాటుకునేందుకే బస్సు యాత్ర చేశారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ లందరూ అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలి అంటే మీరందరూ గెలిపించాలన్నారు. అనంతరం ప్రజావేదిక



నిర్వహించారు. ప్రజలకు తెలిపారు. టిడిపి కౌన్సిలర్ హుస్సేన్ భాష, టిడిపి నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.



గూడూరు చైతన్యరథం: వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు త్వరలోనే నాంది పలు కుదాం అని గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ధ్వజమెత్తారు. వాకాడు మండలం - కొండాపురంలో బుధవారం స్థానిక నాయకులు వేణు నాయుడు, మోహన్ నాయుడు అధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ ఈ కార్యక్రమాని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గూడూరు మాజీ శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ భవిష్యత్ కి గ్యారెంటీ బాబు షూరిటీ కరపత్రాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తేనే మనకు భవిష్యత్తు గ్యారంటీ అని లేకపోతే ఇంకా సామాన్య ప్రజలు బ్రతకలేనంత దీనస్థితి వస్తుందన్నారు, ఇప్పటికే రాష్ట్రం అనేక విధాలుగా అప్పుల పాలు అయిపోయిందని, ఈ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను వివరించారు, రేపు బాబు అధికారంలోకి వస్తే చేయబోయే అభివృద్ధి - సంక్షేమాల గురించి గ్రామస్తులకు వివరించారు.



నియోజకవర్గంలో నిన్నటి నుండి జరుగుతున్న సంఘటనలు అందరూ చూస్తున్నారని, ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగాను లేదా ప్రజలకు ఇబ్బంది కలిగించే కార్యక్రమాలు ఏమైనా చేస్తుంటే పోలీస్ వారు ప్రతిపక్షాలను అరెస్టు చెయ్యటం లేదా హౌస్ అరెస్టు చెయ్యడం, పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్ళటం అనేది సర్వసాధారణమైన విషయమని, కాని రాష్ట్ర సంపదను దోపిడీ చేస్తూ కోట్లాది రూపాయల అవినీతి చేస్తున్న వైకాపా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అవినీతిని బయటపెట్టేందుకు వెళు న్న ప్రతిపక్షాలను హౌస్ అరెస్టులు చెయ్యటం ఎన్నడూ చూడలేదని శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. రెండవరోజు హౌస్ అరెస్టు అయిన అనంతరం శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. కేశవరం గ్రామంలో అక్రమ గ్రావెల్ త్రవ్వకాలను పరిశీలించేందుకు నిన్నటి రోజున మండపేట నియోజకవర్గ జనసేన ఇన్ ఛార్జ్ వేగుళ్ళ లీలా కృష్ణతో కలసి వెళ్ళుటకు సిద్ధం కాగా పోలీసులు హౌస్ అరెస్టు చేసి, అంగర పోలీస్ స్టేషన్ కు తీసుకువెళ్ళి రాత్రి 7 గంటల 30 నిమిషాల సమయం లో బలవంతంగా ఇంటికి పంపిన విషయం అందరికీ తెలిసిందేనని ఎమ్మెల్యే అన్నారు. కేశవరం గ్రామంలో గత 10 రోజుల నుండి ప్రతీ రోజు సుమారు 1200 లారీలు చొప్పున వేలాది లారీలతో అక్రమంగా గ్రావెల్ ను తరలించి, ఒక్కొక్క లారీ గ్రావెల్ 6 వేల రూపాయలకు తోట త్రిమూర్తులు అమ్ముకుంటు న్నారని విమర్శించారు. జగనన్న కాలనీలకు గ్రావెల్ పోస్తాం అని చెప్పి జిల్లా కలెక్టర్ దగ్గర నుండి ఉత్తర్వు లు తీసుకువచ్చి దానిని చూపిస్తూ తోట త్రిమూర్తులు అధికారులను, ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఒక్క లారీ గ్రావెల్ అయిన ఎక్కడ జగనన్న కాలనీలలో పోసారో సమాధానం చెప్పమంటే దానికి సమాధానం చెప్పటం మానేసి నాటకాలు వేస్తుంది ఎవరో అందరికీ తెలుసునన్నారు. జగనన్న కాలనీ పేరిట కోట్లు దోచెస్తున్న మీరు ఏ జగనన్న కాలనీలో ఎన్ని లారీల గ్రావెల్ పోశారు, తవ్విన మట్టికి జగనన్న కాలనీల్లో పోసిన మట్టికి కొలతలు తీయించే దమ్ము తోట త్రిమూర్తులకు ఉందా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు.

నిన్నటి రోజున మీ కమిటీ సభ్యులలో ఒకరికి ఫోన్ చేసి జగనన్న కాలనీలో గ్రావెల్ పొయ్యటానికి ఏమైన ఎస్టిమేషన్లు వేశారా అని అడిగితే ఇంకా వెయ్యలేదని, వెయ్యమని నిన్ననే చెప్పారని ఆయన సమాధానం చెప్పారన్నారు. రాయవరం మండలంనకు సంబంది ంచి వెదురుపాక, చెల్లూరు గ్రామాలు మాత్రమే ఉన్నవని ఇంకెక్కడా అవసరం లేదని ఆయన చెప్పటం జరిగిందన్నారు.

వెదురుపాకలో ఎన్ని లారీలు గ్రావెల్ పోసారు అని అడుగగా ఈరోజే మొదలు పెట్టటం జరిగిందని, రెండు లారీలు పంపించారని, అ రెండు లారీలు కూడా అక్కడ దిగటానికి అవకాశం లేక వెనక్కి పంపేశాం అని ఆయన చెప్పటం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. ఇదంతా డి.ఎస్.పి గార్కి వినిపించటం జరిగిందన్నారు. గత 10 రోజుల నుండి సుమారు 15000 లారీల గ్రావెల్ ఏ జగనన్న కాలనీలలో దింపకుండా కోట్లాది రూపాయలు దోచుకుంటూ పైగా తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో తమ చేతుల మీద పట్టాలిచ్చిన లబ్ధిదారులను మభ్యపెట్టి, మోసం చేసి మీకు స్థలాలు ఇవ్వటానికి ఎమ్మెల్యే, జనసేన ఇన్ ఛార్జ్ వేగుళ్ళ లీలా కృష్ణలు ఇద్దరూ అడ్డుపడుతున్నారని మాయమాటలు చెప్పి అక్కడకు తీసుకువచ్చి వైకాపా నాయకులు దగ్గర ఉండి మాపై స్టేట్ మెంట్స్, దిష్టిబొమ్మల దహనాలు చేయిస్తారా అని మండిపడ్డారు. ఇటువంటి వాటికి భయపడేది లేదని, నిజం నిలకడమీద తేలుతుందన్నారు. కేశవరంలో గ్రావెల్ దోచుకోవడానికి ఇళ్ల పట్టాల అంశం తెరమీదకు తెచ్చారని విమర్శించారు. నిజంగా లబ్ధిదారులపై మీకు అంత అభిమానమే ఉంటే ఈ నాలుగు సంవత్సరాల ఏడు నెలల నుండి ఏం చేశారని, గాడిదలు కాస్తున్నారా అని ప్రశ్నించారు.

గ్రావెల్ ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించుకోవాలనే ఒక తప్పుడు ఆలోచనతో ఇదంతా చేస్తున్నారు తప్ప వేరే కాదన్నారు.

ప్రభుత్వ యంత్రాంగమంతా ఎమ్మెల్సీ తోటకు కొమ్ము కాస్తుందని ఎద్దేవా చేశారు. నిన్నటిదాకా మండపేట పబ్లిక్ స్కూల్ పరిణామాలు చూసామన్నారు. 1400 మంది పిల్లల భవిష్యత్తును గాలికి వదిలేసి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు రౌడీలను పెట్టి స్కూల్ అక్రమించుకుంటే దానిపై స్కూల్ మేనేజ్ మెంట్ పోలీస్ వార్కి కంప్లైంట్ పెట్టినప్పటికీ పోలీసులు చర్యలు తీసుకోకుండా చోద్యం చూశారన్నారు. ఎన్ని అరెస్టులు చేసిన అక్రమ గ్రావెల్ తవ్వకాలను ఆపేంతవరకు ఉద్యమాన్ని విరమించేది లేదని హెచ్చరించారు. తమకు సంఘీభావం తెలపడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్నటువంటి టిడిపి నాయకులు వస్తుంటే ఎక్కడికక్కడే వారందరిని హౌస్ అరెస్టు చేయడం చాలా దారుణం అన్నారు. తమను అడ్డుకుంటున్న ఇదే యంత్రాంగం అక్కడ గ్రావెల్ తవ్వకాలను ఎందుకు నిలువరించలేక పోతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశ్నించారు.

# బీసీలకు నమ్మకద్రోహం చేస్తున్న జగన్



తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం అధ్వర్యంలో బీసీలకు ప్రభుత్వ నమ్మకద్రోహంపై ఐక్య పోరాటం" పేరిట నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బీసీ నేతలతో నవంబర్ 17 న రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశా నిర్వహణ, సంబంధిత ఏర్పాట్లపై చర్చించేందుకు స్థానిక బీసీ నాయకులతో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర మాగుంట లే అవుట్ నందు తన నివాసంలో సమావేశం నిర్వహించారు. బీసీ సోదరులకు జరుగుతున్న అన్యాయం, బీసీ లపై వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, కక్ష సాధింపుల పట్ల బీసీ ల్లో చైతన్యం నింపేందుకు నిర్వహించ తలపెట్టిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంను విజయవంతం చేయాలని బీసీ నేతలకు సూచిం చారు. నాలుగున్నరేళ్లుగా జగన్ రెడ్డి బీసీలను అణచివేస్తూ అవమా నాలకు గురి చేస్తూ పైశాచిక అనందం పొందుతున్నాడు. ఎన్నికలు వచ్చేసరికి ఓట్ల కోసం రాజకీయాలు చేస్తున్నాడు... ఇలాంటి జగన్‌రెడ్డిని గద్దె దించి తెలుగుదేశం పార్టీని గెలిపించుకున్నప్పుడే బీసీ సాధికారత సహకారం అవుతుందన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డా.జెడ్. శివప్రసాద్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్, రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, ముదిరాజ్ సాధికార జిల్లా అధ్యక్షుడు పి.ఎల్.రావు, మాజీ అప్కాబ్ చైర్మన్ కొండూరు పోలి శెట్టి, అన్నం దయాకర్ గౌడ్, శ్రీపతి బాబు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.



రైతాంగాన్ని నడ్డి విరిచి కష్టాలు పాలు చేసిన అన్నదాతకు జగన్ రెడ్డి శాపంగా మారాడని కళ్యాణ దుర్గం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ మాదినేని ఉమామహేశ్వం˜నాయుడు విమర్శించారు. అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్ రెడ్డి పుట్టపర్తి పర్యటన చూస్తే అబద్దాలతో ప్రజలను నమ్మించ˜దానికి వచ్చాడని స్పష్టంగా అర్థమైందన్నారు ఉమ్మడి జిల్లాలో అసలు కరవే లేదని చెప్పేందుకు సీఎం జగన్ రెడ్డి నానా ప్రయత్నాలు చేశారన్నారు ఈరోజు ఎక్కడ చూసినా కరువుతో రైతులు అల్లాడిపోతున్నార న్నారు. తాగేందుకు నీరు లేక పెట్టిన పెట్టుబడులు చేతికి అందక, అన్నదాతలకు చివరికి అప్పులే శరణ్యంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. పుట్టపర్తి పర్యటనలో జగన్ రెడ్డి అబద్ధాలు చెప్పి ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేశారని ఆ ప్రజల చేతులలోనే భూస్థాపితం చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన పార్టీల కలయికతో వైఎస్‌ఆర్సిపి ప్రభుత్వం బేజార్ అవుతుందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మెరకపాలెం, కాత్రేనిపాడు గ్రామాల బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని క్లస్టర్ 7 పరిధిలో, యూనిట్ 29 లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, నియోజకవర్గ పరిశీలకులు చిటికెల రామ్మోహన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రజావేదిక సమావేశంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ అవినీతి ఊబిలో కూరుకుపోయిన వైఎస్‌ఆర్సిపి ప్రభుత్వం ఎన్ని వేల కోట్లు ఖర్చు పెట్టి అయిన అధికారాన్ని మరల దక్కించుకోవాలన్న దురాశతో ఉన్న సమయంలో టిడిపి, జనసేన పార్టీల పొత్తు వైఎస్‌ఆర్సిపి ప్రభుత్వానికి మింగుడు పడటం లేదని మాజీ మంత్రి గొల్లపల్లి అన్నారు ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల రీత్యా ఈ రెండు పార్టీల పొత్తు చారిత్రాత్మక అవసరం అని రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా సంతోషంగా ఉండాలి అంటే రాష్ట్రంలో వైఎస్‌ఆర్సిపి ప్రభుత్వాన్ని తరిమి తరిమి కొట్టాలని అన్నారు. ఏది ఏమైనా ఈ రెండు పార్టీల నిర్ణయం తో ప్రజల్లో చైతన్యం వచ్చిందని, తెలుగుదేశం, జనసేన పార్టీల కలయిక తో రాబోయే ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కి బాటలు వెయ్యబోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకు లకు మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు దుస్సాలువాలు కప్పి పూలదండాలు వేసి సన్మానిం చారు. అనంతరం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఉన్న ష్యూరిటీ బాండ్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గిడుగు



బుజ్జిబాబు, అడబాల శ్రీనివాసరావు, గుబ్బల శ్రీనివాస్, కేతా శ్రీనివాస్, అడబాల సాయిబాబా, జనసేన నాయకులు గుండుబోగుల పెద్దకాపు, గెద్దం మహాలక్ష్మి ప్రసాద్, సూరిశెట్టి శ్రీను, గుబ్బల ఫణి కుమార్, జిన్నూరు పండు, గుండాబత్తుల తాతాజీ, చెల్లింగి వాసు, గాలిదేవర వెంకన్నబాబు, కదలి నాని తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం
# భవిష్యత్తుకు గ్యారంటీ పథకాల తోనే సాధ్యం!

- 12, 13 డివిజన్ల బూత్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే గద్దె రామమోహన్



విజయవాడ తూర్పు (చైతన్యరథం): భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రతి డివిజన్లో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్వహించాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పార్టీ శ్రేణులకు సూచించారు. బుధవారం ఉదయం ఆటోనగర్ లోని తెలుగుదేశం పార్టీ జిల్లా పార్టీ కార్యాలయంలో తూర్పు నియోజకవర్గంలోని 12,13 డివిజన్ల క్లస్టర్, యూనిట్ ఇన్చార్జ్లు, బూత్ కమిటీ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం నారా చంద్రబాబునాయుడు తన వయస్సును కూడా లెక్కచేయకుండా నిరంతరం కష్టపడుతు న్నారని చెప్పారు. 2024లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిన తర్వాత అమలు చేసే సంక్షేమ కార్యక్రమాల గురించి టీడీపీ కార్యకర్తలు డివిజన్లోని ప్రతి ఇంటికి వెళ్ళి విపులంగా వివరించాలని చెప్పారు. పథకం వివరాలతో పాటుగా ఆ పథకం అమలు చేయడం వల్ల ఆకుటుంబానికి జరిగే లబ్ధిని రూపాయాల్లో వివరించి అర్థమయ్యేలా తెలియజేయాలన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి కూడా వివరించాలని చెప్పారు. జగన్మోహన్రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు పడుతున్న కష్టాలతో పాటుగా అధోగతి పాలైన రాష్ట్ర తీరును వివరించాలని చెప్పారు. ఎన్నికల్లో బూత్ కమిటీలదే కీలక పాత్ర అని చెప్పారు. ఓటర్ల జాబితాలను నిశితంగా పరిశీలించి దొంగ ఓటర్లు ఉంటే వాటిని వెంటనే సంబంధిత అధికారులు దృష్టికి తీసుకువెళ్ళాలని అన్నారు. చంద్రబాబునాయుడే రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమాన్ని చేయగలడు అని, ఈ విషయాన్ని కింది స్థాయి వరకు డివిజన్ నాయకులు, కార్యకర్తలు తీసుకువెళ్ళాలని అన్నారు.

తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు సుఖవాసి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు అని, ఆ విజన్తోనే భవిష్యత్తు గ్యారంటీ పేరుతో అద్భుతమైన సంక్షేమ పథకాలను రూపొందించారని చెప్పారు. ఈ పథకాల అమలు వల్ల లబ్దిదారుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని చెప్పారు. ప్రతి కార్యకర్త ఈ సంక్షేమ పథకాల గురించి అవగాహన చేసుకుని ప్రతి ఇంటికి వెళ్ళి ప్రతి ఒక్కరికి విపులంగా వివరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్. ఫిరోజ్, కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయి బాబు, గద్దె వెంకటేశ్వరప్రసాద్, అబ్దుల్ ఖాలిక్, మేదరమెట్ల నారాయణ, నూతి శ్రీనివాస్, వి. శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావులతో పాటు పలువురు బూత్ ఇన్చార్జీలు పాల్గొన్నారు.

## వినాశక పాలన పోయి.. సంక్షేమ, అభివృద్ధి పాలన రావాలి

- అన్ని వర్గాల ప్రజలు ఇదే కోరుకుంటున్నారు
- చంద్రబాబు అధికారంలోకి వస్తే.. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం
- భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత

రాప్తాడు (చైతన్యరథం): రాష్ట్రంలో వినాశక పాలన పోయి సంక్షేమ, అభివృద్ధి పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు మండల కేంద్రంలో రెండవ రోజు బాబు ష్యూరిటీ - భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ఇంట్లో ఎంత మంది ఉన్నారు.. వారు ఏ ఏ పథకానికి అర్హులు అన్నది చెప్పారు. టీడీపీ ప్రకటించిన ఆరు పథకాల్లో ఏ పథకానికి అర్హులన్నది వివరించారు. అలాగే ప్రస్తుత ప్రభుత్వంలో ఏఏ పథకాలు వస్తున్నాయి.. రాకపోతే.. ఎందుకు రాలేదన్నది ఆరా తీశారు. చాలా చోట్ల అన్ని అర్హతలు ఉన్నా.. ఏదో ఒక కారణం చూపుతూ పథకాలు ఇవ్వడం లేదని సునీత దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు అన్ని ఆలోచించి ఆరు అద్భుతమైన పథకాలు మ్యానిఫెస్టోలో పెట్టారని.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఈ పథకాలు అందుతాయన్నారు. ముఖ్యంగా మహిళలకు ప్రతి నెల 15వందల ఆర్థిక సాయం, ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా వారికి అమ్మకు వందనం పేరుతో ఆర్థిక సాయం, ప్రతి ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటివి ఉన్నాయన్నారు. నిరుద్యోగులకు ప్రతి నెల 3వేల భృతి ఇవ్వడంతో పాటు ఉద్యోగ కల్పన కోసం నిర్దిష్టమైన ప్రణాళికతో వెళ్తున్నట్టు చెప్పారు. ప్రజలకు మంచి చేయాల్సిన ఈ ప్రభుత్వం.. ప్రతిపక్షాలపై కక్ష సాధింపులకు పరిమితమైందన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో ఎలాంటి అభివృద్ధి జరగకపోగా.. ఉన్నది కాస్త పోయే పరిస్థితి వచ్చిందన్నారు. ఇలాంటి అన్ని అంశాలను ప్రజలు గమనించాలన్నారు.



# ప్రజా చైతన్య సభ మరియు బాబు ష్యూరిటి - భవిష్యత్తుకు గ్యారంటీ ప్రచారం

- కనుమూరు లో విస్తృత స్థాయిలో ప్రచారం చేసిన తెదేపా ఇన్చార్జీ శావల దేవదత్



తిరువూరు (చైతన్యరథం) : 7వ రోజు న గంపలగూడెం మండలం, కనుమూరు గ్రామంలో బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ విస్తృత స్థాయిలో తెదేపా ఇన్చార్జీ శావల దేవదత్ ప్రచారం చేశారు. మండలం అధ్యక్షుడు, క్లస్టర్ మరియు యూనిట్ ఇన్చార్జి అధ్వర్యంలో ప్రజా చైతన్య సభ నిర్వహించటం జరిగినది. ప్రజా చైతన్య సభలో దేవదత్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఉచితం, అన్నదాత పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి 20 వేల రూపాయల ఆర్థిక సాయం, యువగళం నిధి నెలకు 3000 రూపాయలు ఆర్థిక సాయం, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికి కుళాయి కనెక్షన్లు, ఐదేళ్లలో పేదల ఆదాయం రెట్టింపు పేదలను సంపన్నులు చేయటమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రజా పరిపాలన పూర్తిగా గాలికి వదిలేశారు. రైతులు ఇంతగా బాధ పడుతున్నా, ఒక్క రోజు అయినా జగన్ మోహన్ రెడ్డి, మంత్రివర్గ అముచరణ గళం కూడా వ్యవసాయ క్షేత్రంలోకి అడుగు పెట్టలేదు. ప్రజా పరిపాలన గాలికి వదిలేసి, జగన్ మోహన్ రెడ్డి తనకున్న సమయం అంతా, బాబు మీద రాజకీయ కక్ష తీర్చుకోవటం, అక్రమ కేసులు పెట్టడం. మంత్రులు అయితే కేవలం చంద్ర బాబు , లోకేష్ బాబుని బూతులు తిట్టటానికే అన్నట్లుగా వుంది వారి శాఖలు అసలు మంత్రులకు వారి శాఖల మీద పట్టు ఉందా? రాష్ట్రాన్ని మళ్ళీ అభివృది పథం లో పెట్టాలంటే చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం వుందని దేవదత్ అన్నారు. అనంతరం భవిష్యత్తు గ్యారెంటీ సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు పథకాల గురించి తెదేపా ఇన్చార్జీ శావల దేవదత్ వివరించారు. ప్రతి గడపకు తిరుగుతూ, చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను శావల దేవదత్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రేగళ్ళ వీరారెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఇనుగంటి మధుసూధన్ రావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు దిరిశాల వెంకట కృష్ణారావు, క్లస్టర్ ఇన్చార్జి గువ్వల వెంకటేశ్వర రెడ్డి, క్లస్టర్ ఇన్చార్జి కొత్తా రజినీ కాంత్, నియోజకవర్గ తెలుగు రైతు ఉపాధ్యక్షులు జంగా చెంచు రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు చెరుకు సత్యనారాయణ రెడ్డి , మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు తుమ్మూరు అప్పిరెడ్డి, యూనిట్ ఇన్చార్జి చెరుకు నర్సారెడ్డి, అత్తునూరి వెంకట రెడ్డి , బూత్ కన్వీనర్స్ మావూరు ఉపేందర్ రెడ్డి , రేగళ్ళ శిద్దారెడ్డి, గూడెల్లి రాఘవ రావు, మండల తెలుగు యువత అధ్యక్షులు మానుకొండ రామకృష్ణ, నియోజకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి రేగళ్ళ బాలకోటిరెడ్డి, మందడపు జానకి రామ్, ఎంపీటీసీ దొంతల బుచ్చి రామయ్య మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో టీఎన్టియుసీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



పాపంపేట (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర అధ్యక్షులు అచ్చం నాయుడు జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ టీఎన్టియుసీ రాష్ట్ర అధ్యక్షులు గొట్టుముక్కల రఘురాం రాజు జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, బికె పార్థసారథి, రాప్తాడు నియోజకవర్గం ఇంచార్జ్ పరిటాల సునీత అధ్వర్యంలో పాపంపేట గ్రామంలో నిరసన ర్యాలీ చేపట్టడం జరిగింది. టీఎన్టియుసి జిల్లా అధ్యక్షులు తడాల నాగభూషణం రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాళ్ల నాగేంద్ర మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని రాష్ట్రానికే తలమానికమైన పరిశ్రమల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తుగ్ల ప్రభుత్వం యొక్క చేతకాంతన మరియు బిజెపి ప్రభుత్వ ఆంధ్రులపై చిన్న చూపుకు ఈ ప్రైవేటీకరణ నిదర్శనం కావున విశాఖ అనే డిమాండ్తో కార్మికుల యొక్క కార్మిక లోకం యావత్తు వెయ్యి రోజులు రిలే నిరాహార దీక్షలో చేయడం చాలా బాధాకరం దీనికి మద్దతుగా ఉమ్మడి అనంతపూర్ జిల్లాలో రాప్తాడు నియోజకవర్గం కళ్యాణ్ దుర్గం రోడ్డు పాపంపేట అనంతపురం రూరల్ మండలం నిరసన కార్యక్రమం ర్యాలీ నిరసనగా చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి ఉపాధ్యక్షులు మంద నర్సింహులు నియోజకవర్గ రాప్తాడు కార్యదర్శి రామకృష్ణ టీడీపీ నాయకులు పేరం హరి. మాజీ ఎంపీటీసీ లింగమయ్య. రాజు కక్కలపల్లి కాలనీ రాజు. టీడీపీ లీడర్ వెంకటస్వామి తెలుగు యువత నియోజవర్గ అధ్యక్షులు మద్దినేని కృష్ణ . గ్రామ అధ్యక్షుడు జెట్టి భరత్ అక్కంపల్లి అంజినేయులు. నాగలింగారెడ్డి శ్రీరాములు ఎక్స్ ఎంపీటీసీ. బండి వీరనారప్ప. షఫీ. నాయుడు స్వామి హెూటలు ఎంపీటీసీ నారాయణస్వామి కక్కలపల్లి ముత్యాలు ఎన్ .గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

- యార్లగడ్డ వెంకట్రావు హామీ



హనుమాన్ జంక్షన్ (చైతన్యరథం): తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగిస్తామని గన్నవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు. బుధవారం సాయంత్రం బాపులపాడు మండలం రామన్నగూడెం, వైకుంఠ లక్ష్మీపురం, కాకులపాడు, కానుమోలు గ్రామాల్లో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ వెంకట్రావు గ్రామంలోని వీధుల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవు తున్న మరికొంత మందికి నగదు సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కరువు పరిస్థితుల్లో తెలుగుదేశం ప్రభుత్వం ముందు చూపుతో నిర్మించిన పట్టిసీమ రైతులను ఎంతగానో ఆదుకుందన్నారు. పట్టిసీమ దండగన్న ప్రభుత్వ నేతలు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని సూటిగా ప్రశ్నించారు. ఈ ఏడాది కృష్ణా డెల్టా కింద ఖరీఫ్ సాగుకు కేవలం పట్టిసీమ నీరే దిక్కు అయిందని తెలిపారు. గన్నవరం నియోజకవర్గంలో రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు ఆయన చెప్పారు. కాలువ కింది గ్రామాల్లో రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు పోలవరం కాలువ నీటిని ఏలూరు కాలువకు అనుసంధానం చేసేందుకు బాపులపాడు మండలం అంపాపురం గ్రామం వద్ద గత టిడిపి ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేసిన పథకం పనులు జరుగక కేవలం శంకుస్థాపనలకే పరిమితమైందని, తాము అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే ఈ పథకాన్ని పూర్తి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కృష్ణా డెల్టాలో కాలువల నిర్వహణ సక్రమంగాలేక పూడిక పేరుకుపోయి నీటిపారుదల ఇబ్బందులు తలెత్తుతున్నాయని దీనిని పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతి ఏటా వేసవిలో సాగునీటి కాలువల్లో పూడిక తీయిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. రామన్నగూడెం గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక కొద్దిపాటి వర్షానికి గ్రామం నీట మునుగుతుందని ఈ సమస్యను పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రామన్నగూడెం, వైకుంఠ లక్ష్మీపురం, కాకులపాడు, కానుమోలు గ్రామాల్లో చెరువుల్లోని పూడిక తీయించి చెరువు నీటిని ప్రజలు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటా మన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధాన్యం కొనుగోలు ఇబ్బందులు తొలగిస్తామని హామీ ఇచ్చారు.

# బీసీలంతా ఏకమై జగన్ రెడ్డి కోట బద్దలుగొడదాం!

- నిధులు నిధులు దూరం చేసిన జగన్ రెడ్డిని రాష్ట్రం నుండి తరుముదాం
- కర్నూలులో టీడీపీ బీసీ విభాగం అధ్వర్యంలో కులసంఘాలు, అఖిలపక్షాలతో రౌండ్ టేబుల్ సమావేశం






**కర్నూలు (చైతన్యరథం):** బీసీ హక్కులు హరిస్తూ, బీసీల నిధులు దారి మళ్లించి, బీసీలను హత్య చేసిన జగన్ రెడ్డిని రాష్ట్రం నుండి తరిమి కొట్టినపుడే బీసీల బతుకులు బాగుపడతాయని కర్నూలులో బీసీ కుల సంఘాలు, అఖిలపక్షాలతో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు. జగన్ రెడ్డి అవినీతి, అరాచక సామ్రాజ్యపు పునాదుల్ని బీసీలంతా ఏకమై బద్దలు కొట్టేందుకు సిద్ధం కావాలని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు శాసన మండల సభ్యులు బీటీ నాయుడు తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ.. జగన్ రెడ్డి అరాచకాలను ఎండగట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు దశాబ్దాలుగా అనుభవిస్తున్న 34% రిజర్వేషన్లను జగన్ రెడ్డి కుదించి 16,800 పదవులు దూరం చేశాడు. పంచాయతీల నిధులు రూ.8,600 కోట్లు దారి మళ్లించారు. ఎన్టీఆర్‌తోనే రాష్ట్రంలో బీసీలకు రాజకీయ అవకాశాలు వచ్చాయి. చంద్రబాబు వచ్చాక బీసీలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా తోడ్పాటు అందించారన్నారు. కీలక మంత్రి పదవులు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చారు. కర్నూలు నియోజకవర్గంలో కె.ఇ.కృష్ణమూర్తి లాంటి ప్రజానాయకుల్ని తయారు చేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీదే అన్నారు. టీడీపీలో బీసీలకు మంత్రి పదవులిచ్చి, వారికి స్వాతంత్ర్యం కల్పిస్తే.. జగన్ రెడ్డి బీసలకు పదవులిచ్చామని చెబుతూ, వారికి షాడోలుగా రెడ్లను నియమించి పెత్తనం చెలాయిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జగన్ రావాలి అని నినదించిన ప్రజలంతా.. నాలుగున్నరేళ్ల అరాచకం చూశాక పోవాలి జగన్ అంటూ నినదిస్తున్నారన్నారు. జగన్ రెడ్డి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా వచ్చే ఎన్నికల్లో బీసీలంతా ఏకమై జగన్ రెడ్డి కుట్రల సామ్రాజ్యాన్ని నేలకూలుస్తామన్నారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా 13 తీర్మానాలు చేసి, కేంద్ర కార్యాలయానికి పంపించి వాటిని అధికారంలోకి వచ్చాక నెరవేర్చేలా తీర్మానం చేస్తున్నట్లు బి.టి.నాయుడు తెలిపారు.

**మాజీ ఎమ్మెల్యే కె.ఇ.ప్రభాకర్ మాట్లాడుతూ..** నాలుగున్నరేళ్లుగా బీసీల బతుకుల్ని ఛిద్రం చేసిన జగన్ రెడ్డి ఇప్పుడు బస్సు యాత్రల పేరుతో సిగ్గులేని యాత్రలు చేస్తున్నాడు. బస్సు యాత్ర చేస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రుల్ని ప్రశ్నిస్తున్నా.. నాలుగున్నరేళ్లలో ఏం ఉద్దరించారని యాత్రలు చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. బీసీలకు చెందిన రూ.75వేల కోట్ల నిధులు దారి మళ్లించినందుకు యాత్ర చేస్తున్నారా? 30 సంక్షేమ పథకాలు రద్దు చేసినందుకా.. 75 మంది బీసీల్ని హత్య చేసినందుకా.. కార్పొరేషన్లను ఉత్సవ విగ్రహాల్లా తయారు చేసినందుకా.. సలహాదారులు, యూనివర్సిటీ వైస్ ఛైర్మన్లు, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు స్థానం లేకుండా చేసినందుకా? ఏం చేశారని యాత్రలు చేస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన వెంటనే బీసీల అభ్యున్నతికి సంబంధించి 13 తీర్మానాలు చేస్తున్నట్లు ప్రకటించారు.

**తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ..** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని బీసీ నేతలు, కుల సంఘాలను ఏకం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశాలు ఏర్పాటుచేసుకున్నాం. ప్రజల్లో చైతన్యం నింపి జగన్ రెడ్డి బీసీలకు చేస్తున్న మోసాన్ని, నయవంచనను ఎదుర్కోవాలి. బీసీలక రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన వేల కోట్ల నిధుల్ని దారి మళ్లించి బీసీలను ఉద్ధరించినట్లు జగన్ రెడ్డి ప్రచారం చేసుకోవడం అత్యంత దుర్మార్గం. హత్యలు చేశారు. తప్పుడు కేసులు పెట్టారు. దాడులు చేస్తున్నారు. అయినా మనం ఐక్యంగా ముందుకు వెళ్లకుంటే ఎప్పటికీ ఇలాగే బాధితులుగా ఉండిపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి కుట్రలు ఏ స్థాయికి చేరాయంటే.. మన కళ్లతో మనల్ని పొడవడమే లక్ష్యంగా బీసీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలను రోడ్లపై తిప్పుతున్నాడు. నలుగురికి చిల్లర పదవులు ఇచ్చి ఆ సామాజిక వర్గాన్నంతా ఉద్ధరించాననంటూ వారి చేత ప్రచారం చేయిస్తున్నాడు. ఇలాంటి వ్యక్తి మళ్లీ ముఖ్యమంత్రి అయితే.. రాష్ట్రంలో బీసీలు బతకడం ప్రశ్నార్థకం అవుతుందని, ఇప్పటికైనా బీసీలంతా ఏకమై జగన్ రెడ్డిపై పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మన బతుకుల్ని మనమే మార్చుకోవాలని, అందుకోసం అవసరమైన కసరత్తు చేయాల్సిన బాధ్యత కూడా మనపైనే ఉందన్నారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా ఈ సమావేశం వేదికగా 13 తీర్మానాలను ఆమోదిస్తున్నామని, వాటిని కేంద్ర కార్యాలయానికి పంపించి అధికారంలోకి వచ్చాక నెరవేర్చేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

**ఎమ్మిగనూరు జనసేన ఇంఛార్జి రేఖా గౌడ్ మాట్లాడుతూ..** జగన్ రెడ్డి పాలనలో బీసీలు ఇంకా వెనకబాటు తనానికి గురవుతున్నారు. పేదలు మరింత పేదలవుతున్నారు. నిదులు దారి మళ్లించి, రాజ్యాధికారానికి దూరం చేసి, పదవులు దూరం చేసి ఏం ఉద్దరిచినట్లు అని ప్రశ్నించారు. కుట్రలు కుతంత్రాలతో నెగ్గాలని ప్రయత్నిస్తున్న జగన్ రెడ్డిని ఓడించి బీసీల బతుకులు మార్చుకుందామని పిలుపునిచ్చారు.

**సమాజ్ వాదీ పార్టీ నేత, జె.శ్రీనివాస్ మాట్లాడుతూ..** జగన్ రెడ్డి పాలనలో బీసీలను హత్యలు చేయడంలో, మోకాళ్లపై కూర్చోబెట్టడంలో, దాడులు చేయడంలో ప్రాధాన్యమిచ్చారని ఎద్దేవా చేశారు. స్వతంత్ర భారత దేశ చరిత్రలో జగన్ రెడ్డి పాలనలో బీసీలకు జరిగినంతటి ద్రోహం ఎన్నడూ జరగలేదన్నారు. జగన్ రెడ్డి అరాచకాన్ని అంతా ఏకమై ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

**యాదవ సాధికార సమితి కన్వీనర్ నాగేశ్వర్ యాదవ్ మాట్లాడుతూ..** బీసీలంతా ఏకమైతే జగన్ రెడ్డి ఏమీ చేయలేడు. బీసీల్లో చీలిక తెచ్చి తన పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిసతున్నాడు. నిధులు మళ్లించి, అధికారాల్ని లాక్కుని బీసీలను ఏం ఉద్దరించారని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని బీసీలంతా ఏకం కావాల్సిన సమయం అసన్నమైందని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో వాల్మీకి బోయ సంఘం తరపున నాగరాజు నాయి బ్రాహ్మణ సంఘం తరపున మోహన్ కురుబ సంఘం తరపున దేవేంద్రప్ప క్రిస్టియన్స్ తరపున బాబురాజు ఆర్య కటక తరపున బాలాజీ రావు వీర శివ లింగాయత్ తరుపున మల్లికార్జున చేనేత తరపున ప్రభాకర్ రజకుల తరపున చంద్రశేఖర్ యాదవ సంఘం తరపున అయ్యన్న యాదవ్ బెస్త సంఘం తరపున సుభాష్ చంద్రబోస్ బార్ కౌన్సిల్ లీగల్ ఛైర్మన్ రవి బీసీ నాయకులు గుడిసె కృష్ణమ్మ లక్ష్మీనారాయణ శ్రీనివాసులు సంజీవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నియంతను నేలకూలుద్దాం.. ఇదే ఆంధ్ర రాష్ట్ర ప్రజల నినాదం : కొండబాబు



**కాకినాడ (చైతన్యరథం):** అదాయం పెంచి, ఆస్తులు సృష్టించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి దిశగా ప్రయాణిస్తుందని, ఆ అభివృద్ధి చంద్రబాబుతో మాత్రమే సాకారమవుతుందని, జగన్ రెడ్డి నియంత పాలన నేల కూల్చి, చంద్రబాబుతో రాష్ట్ర అభివృద్ధిని సాధించుకోవడానికి ప్రజల వేచి చూస్తున్నారని కాకినాడ సిటీ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కొండబాబు బుధవారం స్థానిక 7 వ డివిజన్ రేచర్ల పేట, బర్మా కాలనీ, నందు పర్యటించి మహాశక్తి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ చంద్రబాబు పరిశ్రమలు, పెట్టుబడులు పెట్టించి రాష్ట్రానికి అదాయం సృష్టించారని, రాష్ట్రానికి ఆదాయాన్ని సృష్టించి, ఆస్తులు పెంచి, రూపాయి పెట్టుబడి పెట్టకుండా దాదాపు రూ.2 లక్షల కోట్ల విలువైన అమరావతిని సృష్టిస్తే, జగన్ రెడ్డి ఆంధ్ర రాష్ట్ర భావితరాల భవిష్యత్తును నాశనం చేస్తూ, సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్ర వనరులను దోచుకుని, ప్రజల సొమ్ముతో తన అవినీతి సామ్రాజ్యాన్ని పెంచి పోషిస్తున్నాడని, జగన్ రెడ్డి అనే పెత్తందారుడిని ఓడించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకునేందుకు రాష్ట్ర ప్రజల సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, అంబటి సత్యనారాయణ చిన్నా, కొల్లు కుమారి, బొచ్చా దాసు, సామంతుల నాగేంద్రప్రసాద్, డోకుబుర్ర రాజు, కర్నిడు వరప్రసాద్, గుడుమూరి మధుసూదన్, గండేటి శాస్త్రి, ఏడిద శ్రీను, లాలు, చేల్లారి విజయలక్ష్మి, ధనియాల సింహాద్రి, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం : రిషితా రెడ్డి



**శ్రీకాళహస్తి (చైతన్యరథం):** 10 వార్డ్ నందు పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ మరియు వార్డు ఇంచార్జి మస్తాన్, యూనిట్ కరీం మరియు వార్డు నాయకులు బాబు, మహేంద్రా, గౌతమి, భానుబేగం, నజుని, అంకమ్మ, ఫకహృదిన్, సురేష్, రవి నాయుడు, సతీష్ ఆధ్వర్యంలో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి శ్రీ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసి తెలుగుదేశం పార్టీ వచ్చే 2024 ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించలని తెలిపారు. శ్రీకాళహస్తి లో అభివృద్ధి జరగాలంటే గోపాలన్న పాలన రావాలని తెలిపారు.

ప్రజలకు స్వేచ్ఛగా బ్రతకాలంటే తెలుగుదేశం ప్రభుత్వం తోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలను పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 'జనాభా నియంత్రణ' వ్యాఖ్యలపై మోదీ ఆగ్రహం

**ఢిల్లీ:** జనాభా నియంత్రణ విషయంలో మహిళల విద్యకున్న ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ బీహార్‌సీఎం నీతీశ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. వీటిని ఉద్దేశిస్తూ... ప్రధాని మోదీ తీవ్రంగా స్పందించారు. ఇంకా ఎంతగా దిగజారిపోతారంటూ నీతీశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని గుణలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న సందర్భంగా మోదీ ఈ విధంగా మాట్లాడారు. "ప్రతిపక్షాల అహంకార కూటమిలో పెద్దనేత అయిన ఆయన... నిన్న అసెంబ్లీలో మహిళలను ఉద్దేశించి అసభ్య పదజాలం ఉపయోగించారు. ఇలాంటి మాటలు వాడటం పట్ల వారికి సిగ్గుగా అనిపించడం లేదా..? ఆ కూటమిలోని ఏ ఒక్కనేత కూడా నీతీశ్ మాటలను ఖండించలేదు. మహిళల గురించి ఈ రకమైన ఆలోచన ఉన్నవారు మీకు ఏదైనా మంచి చేయగలరా..? మన తల్లులు, సోదరీమణుల పట్ల ఇలాంటి దురుద్దేశంతో దేశాన్ని అవమానిస్తున్నారు. మీరు ఇంకా ఎంతగా దిగజారిపోతారు..?' అంటూ నీతీశ్ వ్యాఖ్యలను ఆక్షేపించారు. ఇటీవల బిహార్‌లో నిర్వహించిన కులగణనకు సంబంధించిన నివేదికను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా నితీశ్ మాట్లాడుతూ... చదువుకున్న మహిళలు తమ భర్తలను నియంత్రించగలరని వ్యాఖ్యానించారు. "భర్తల చర్యల వల్ల



జననాలు పెరిగాయి. అయితే చదువుకున్న మహిళకు భర్తను ఎలా నియంత్రించాలో తెలుసు. అందుకే ఇప్పుడు జననాల రేటు తగ్గుతూ వస్తోంది" అని మాట్లాడారు. ఈ మాటలపైదుమారం రేగడంతో నీతీశ్ క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. 'నా మాటలు మిమ్మల్ని ఇబ్బందికి గురిచేస్తే...వాటిని ఉపసంహరించుకుంటా' అని పేర్కొన్నారు.

# ఒక్కో మహిళకు రూ. వెయ్యి రూపాయల దీపావళి కానుక



ప్యారీస్(చెన్నై): అప్పీలు చేసుకున్న 8 లక్షల మంది గృహిణులకు ఈనెల 10వ తేది నుంచి వారి బ్యాంక్ ఖాతాలో రూ1,000 జమ చేయను న్నట్లు తమిళదనాడు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. సెప్టెంబరు 15న మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై జయంతి సందర్భంగా గృహిణులకు ప్రతినెలా రూ. 1,000 పంపిణీ చేసే పథకానికి రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద 1.6 కోట్ల మంది మహిళలకు ప్రతి నెలా 14వ తేదీన వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ అవుతోంది. ఈ పథకం కోసం రాష్ట్రప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.7 వేల కోట్లు కేటాయించింది. ఇదిలా ఉండగా, రూ.1,000 పొందని గృహిణులు సుమారు 8 లక్షల మందికి పైగా అప్పీలు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల పరిశీలన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరోవైపు ఈనెల 12న దీపావళి పండుగ జరుపుకోనున్న సందర్భంగా రెండు రోజుల ముందే అప్పీలు చేసుకున్న గృహిణులకు రూ.1,000 వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు వారి సెల్‌ఫోన్లకు ఎస్‌ఎంఎస్ పంపనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ పథకానికి ఎంపికైన గృహిణులకు ఎస్‌ఎంఎస్‌లు పంపే పనులు చురుకుగా సాగుతున్నాయని తెలిపారు.





న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన సోదరుడు, బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీని కలిశారు. మంగళవారం వీరిద్దరు కేదార్‌నాథ్ ఆలయానికి వెళ్లారు. ఆలయంలో కొద్దిసేపు మాట్లాడుకున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. సోదరులిద్దరూ ఈ విధంగా బహిరంగ ప్రదేశాల్లో కనిపించడం చాలా అరుదు. దీంతో భవిష్యత్‌లో రాజకీయ మార్పులు ఏమైనా ఉంటాయా అనే ఊహాగానాలు కూడా వెలువడుతున్నాయి. ఆలయం వెలుపల ఇద్దరూ కలుసుకున్నారని, ఆహ్లాదకరంగా పలకరించుకున్నారని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. కలుసుకున్నది కొద్దిసేపే అయినా ఆత్మీయంగా గడిపారని వివరించాయి. వరుణ్ గాంధీ కూతురిని కలిసినందుకు రాహుల్ చాలా సంతోషంగా ఉన్నారని ఆయా వర్గాలు పేర్కొన్నాయి. సోదరులు ఇద్దరూ పెద్ద కలుసుకోక పోయినప్పటికీ చక్కటి ఆప్యాయతాను బంధాన్ని కొనసాగిస్తున్నారని వెల్లడించారు. వీరిద్దరి మధ్య రాజకీయ అంశాలకు సంబంధించి ఎలాంటి ప్రస్తావన లేదని చెప్పారు. మేనేకాగాంధీ-సంజయ్ దంపతుల కుమారుడైన వరుణ్ గాంధీ కొన్ని నెలలుగా బీజేపీ సమావేశాల్లో అంత పెద్దగా కనిపించడం లేదు. అంతేకాదు రాజకీయంగా కీలకమైన అంశాలపట్ల ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా కొంత చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా రైతు చట్టాలతోపాటు కొన్ని అంశాల్లో బీజేపీ స్టాండ్‌కు విరుద్ధంగా వ్యవహరించారని చర్చ జరిగింది. ఇదిలావుండగా గతేడాది ఓ మీడియా సమావేశంలో వరుణ్ గాంధీని మళ్లీ కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తారా అని మీడియా ప్రశ్నించగా ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. ఎవరూ ఆహ్వానించకుండానే వరుణ్ గాంధీ బీజేపీ/ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను అందిపుచ్చుకున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించిన విషయం తెలిసిందే. కాగా వరుణ్ గాంధీ ప్రస్తుతం ఎంపీగా ఉన్నారు.

# వందే సాధారణ్ ఎక్స్‌ప్రెస్ ట్రయల్ రన్ విజయవంతం

ముంబయి: దేశీయ ఉత్పత్తులను ప్రోత్సాహించేందుకు మేకిన్ ఇండియా క్యాంపెయిన్‌ని మొదలుపెట్టిన భారత ప్రభుత్వం.. ఇప్పటికే పలు ప్రొడక్టులను రంగంలోకి తీసుకొచ్చింది. అందులో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కూడా ఒకటి. ఇది పూర్తిగా భారతదేశంలో మన భారతీయ ఇంజినీర్లు తయారు చేసిన మొట్టమొదటి రైలు. ఆల్రెడీ ఇది ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తోంది. ఇప్పుడు వందేభారత్ సాధారణ్ కూడా త్వరలోనే పట్టాలపై పరుగులు పెట్టేందుకు సమాయత్తం అవుతోంది. డిసెంబర్‌లో దీనిని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలోనే.. నవంబర్ 8వ తేదీన భారతీయ రైల్వే ఈ వందే సాధారణ్ ఎక్స్‌ప్రెస్ ట్రయల్ రన్‌ను నిర్వహించింది. ముంబై నుండి ఈ ట్రయల్ రన్ నిర్వహించగా.. ఎలాంటి ఆటంకాలు లేకుండా ఇది విజయవంతంగా అహ్మదాబాద్‌కు చేరుకుంది. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవ్వగా.. ఇది ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. వందే భారత్ రైళ్లు పూర్తిగా 'ఎయిర్ కండీషన్డ్' బోగీలతో నడుస్తుండగా.. ఈ వందే సాధారణ్ రైళ్లలో నాన్-ఏసీ బోగీలను కలిగి ఉంటాయి. ఇదొక్కటి మినహాయించి.. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ఉండే ఇతర అధునాతన ఫీచర్లు ఇందులోనూ ఉంటాయి. 22 కోచ్‌లతో కూడిన ఈ నూతన రైళ్లు.. విభిన్న శ్రేణి ప్రయాణికులకు అనుగుణంగా స్లీపర్, సాధారణ క్లాసులు ఉంటాయి.

అంతేకాదు.. ఈమధ్య రైలు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న తరుణంలో, ముందుగానే ప్రమాదాల గురించి అప్రమత్తం చేసేందుకు ఈ వందే సాధారణ్ రైళ్లలో భద్రతా సెన్సార్లను అమర్చారు. అలాగే.. ప్రయాణికుల భద్రత కోసం బోగీలలోనూ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ రైలుకు రెండు చివర్లలో రెండు ఇంజిన్లు ఉంటాయి. మొత్తం 1800 ప్రయాణికులు ఈ కొత్త రైళ్లలో సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చు. దీని గరిష్ట వేగం 130 కెఎంపీహెచ్ ఉంటుంది. ఇప్పుడున్న సాధారణ



రైళ్లతో పోలిస్తే ఈ వందే సాధారణ్ రైళ్లు మరింత వేగంగా ప్రయాణిస్తాయి కాబట్టి.. 500 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణం చేసినప్పుడు సమయం చాలా ఆదా అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ముంబై-న్యూఢిల్లీ, పాట్నాన్యూఢిల్లీ, హౌరా-న్యూఢిల్లీ, హైదరాబాద్-న్యూఢిల్లీ, ఎర్నాకులం-గౌహతి సహా పలు ప్రముఖ మార్గాల్లో ఈ వందే సాధారణ్ రైళ్లను ప్రవేశపెట్టనున్నట్టు తెలుస్తోంది. క్రమంగా.. ఇతర మార్గాల్లోనూ ఈ రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చేలా భారత రైల్వే ప్రణాళికలు రచిస్తోంది. ప్రయాణీకులకు తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన సేవలు అందించాలనే లక్ష్యంతోనే.. భారత రైల్వే ఈ అధునాతన ఫీచర్లు కలిగిన కొత్త రకపు రైళ్లను అందుబాటులోకి తీసుకొస్తోంది. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పోలిస్తే.. ఇందులో టికెట్ ధరలు చాలా తక్కువగా ఉంటాయని సమాచారం.

### ఢిల్లీలో వాయు కాలుష్యం వల్ల

# స్కూళ్లకు శీతాకాలపు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం

**ఢిల్లీ:** దేశ రాజధాని న్యూఢిల్లీ తీవ్ర వాయు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. చుట్టు పక్కల రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలబెట్టడంతోపాటు ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఢిల్లీలో గాలి నాణ్యత ప్రమాదకర స్థాయిని మించిపోయింది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తాజాగా ఒక కీలక ప్రకటన చేసింది. రాజధానిలో తీవ్ర వాయు కాలుష్యం నేపథ్యంలో ఢిల్లీలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు శీతాకాల సెలవులు ప్రకటించింది. నవంబర్ 9 నుంచి 18వ తేదీ వర కూ అన్ని స్కూళ్లకు ముందస్తు శీతాకాల సెలవులు ప్రకటి స్తున్న ట్లు విద్యాశాఖ ప్రకటన విడుదల చేసింది. సాధా రణంగా ఢిల్లీలో స్కూళ్ల కు శీతాకాల సెలవులు జ న వ రి లో



ఇస్తుంటారు. అయితే, ఈ సారి తీవ్ర వాయు కాలుష్యం కార ణంగా ముందుగానే ప్రకటించాల్సి వచ్చింది. కాలు ష్యం నేపథ్యంలో ఢిల్లీతో పాటు నేషనల్ క్యాపిటల్ రీజియన్ పరిధిలోని గౌతమ్‌బుద్ధానగర్, ఘజియాబాద్‌లో ఉన్నత స్కూళ్లను ప్రభుత్వం ఇప్పటికే మూసివేసింది. రాబోయే ఆరురోజుల పాటు ఢిల్లీలో వాతావరణం మరింత అధ్వానస్థాయికి చేరుకుంటుందని అంచనా. ఉష్ణోగ్రతలు పడిపోయే అవ కాశం ఉందని.. దాంతో కాలుష్యం స్థాయి మరింత పెరిగే అవకాశం ఉంద ని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, నవంబర్ 10న ఢిల్లీలో తేలిక పాటి వర్షం కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం పేర్కొంది. 13వ తేదీ వరకు ఉదయం వేళల్లో పొగమంచు పేరుకు పోతుందని పేర్కొంది.

### డిసెంబర్ రెండో వారంలో

# పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం..!

న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ రెండో వారంలో ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 3న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. అనంతరం రెండో వారంలో పార్లమెంట్ వింటర్ సెషన్ మొదలై క్రిస్మస్ పండుగకు ముందు ముగియనుంది. ఈ సమావేశాల్లో ఐపీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌ల సవరణలకు సంబంధించిన బిల్లులు చర్చకు రానున్నాయి. ఈ బిల్లులకు సంబంధించిన మూడు నివేదికలు ఇప్పటికే కేంద్ర హోంశాఖ స్టాండింగ్ కమిటీకి చేరాయి. అదేవిధంగా పార్లమెంట్‌లో పెండింగ్‌లో ఉన్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్‌ల నియామకానికి సంబంధించిన బిల్లులపై కూడా ఈ సమావేశాల్లో చర్చ జరుగనుంది. వాస్తవానికి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రతి ఏడాది నవంబర్ మూడో వారంలో ప్రారంభమై డిసెంబర్ 25న జరిగే క్రిస్మస్ పండుగకు ముందు ముగుస్తాయి. కానీ, ఈసారి ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆలస్యంగా పార్లమెంట్ వింటర్ సెషన్ మొదలవుతున్నది.



కెన్యా, సోమాలియాలో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు కారణంగా కనీసం 40 మంది మరణించగా 10వేల మంది నిరాశ్రయులయ్యారని సహాయ సంస్థలు నివేదించాయి. సోమాలియాలో వరదల కారణంగా సుమారుగా 25 మంది మరణించారు. ఇళ్లు, రోడ్లు, వంతెనలు ధ్వంసమైన తరువాత ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. దక్షిణ సోమాలియాలోని జుబాలాండ్ రాష్ట్రంలోని లూక్ జిల్లాలో వరద నీటిలో చిక్కుకున్న 2,400 మంది నివాసితులను చేరుకోవడానికి అత్యవసర, రెస్క్యూ కార్యకర్తలు ప్రయత్నిస్తున్నారు.

యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఫర్ ది కోఆర్డినేషన్ ఆఫ్ హ్యుమానిటేరియన్ అఫైర్స్ జుబా, షాబెల్లె నదుల వెంబడి వరదలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించింది. జుబా మొత్తం విస్తీర్ణంలో నివసించే ప్రజలను ఖాళీ చేయమని పిలుపునిచ్చింది. సోమాలియా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ సంక్షోభంపై వేగంగా స్పందిస్తోంది, డొలోకు విమానాన్ని పంపించి, రెండు పడవలను కిస్మాయో నుండి లుక్‌కు, ఒకటి బార్‌ధేర్‌కు తరలింపులో సహాయం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ హసన్ ఇస్సే అసోసియేటెడ్ ప్రెస్‌తో అన్నారు. ఇథియోపియన్ హైలాండ్స్‌లో అప్‌స్ట్రీమ్ నుండి ఎక్కువ నీరు రావడం వల్ల రాబోయే కొద్ది రోజుల్లో ప్రస్తుత వరదల పరిమాణం క్షీణించే అవకాశం ఉందని ఇస్సే చెప్పారు. నాలుగు సంవత్సరాల తరువాత సోమాలియాను భారీ వర్షాలు ముంచెత్తడం విశేషం.

కెన్యాలో, శుక్రవారం నుండి భారీ వర్షాలు ప్రారంభమైనప్పటి నుండి మరణించిన వారి సంఖ్య 15కి పెరిగిందని కెన్యా రెడ్‌క్రాస్ తెలిపింది, ఓడరేవు నగరం మొంబాసా, ఈశాన్య కౌంటీలు మండేరా, వాజిర్‌లు



తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఆకస్మిక వరదతో 241 ఎకరాల వ్యవసాయ భూమి ధ్వంసం కాగా 1,067 పశువులు మరణించాయని కెన్యా రెడ్‌క్రాస్ నివేదించింది. ఇథియోపియాలోని సోమాలి ప్రాంతంలో కూడా భారీ వర్షాలు, వరదలు సంభవించాయి. వరద నీటితో ఇళ్ళు, వ్యవసాయ భూములు ధ్వంసమైన తరువాత వేలాది మంది తమ ఇళ్లను విడిచిపెట్టవలసి వచ్చింది.

### గాజా హాస్పిటల్ నిర్మాణానికి ..

## 6 విమానాలతో సామాగ్రిని పంపించిన యూఏఈ



గాజా స్ట్రిప్ ఏర్పాటు చేయనున్న ఫీల్డ్ హాస్పిటల్ నిర్మాణానికి మద్దతుగా సామాగ్రి, పరికరాలను యూఏఈ తరలించింది. సహాయ సామాగ్రితో ఆరు అదనపు విమానాలు బుధవారం బయలుదేరాయి. అబుదాబి నుండి బయలుదేరి, ఈజిప్టులోని అల్-అరిష్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటాయి. పాలస్తీనా ప్రజలకు మద్దతుగా యూఏఈ ప్రారంభించిన ఆపరేషన్ "గాలంట్ నైట్ 3" లో భాగంగా వీటిని ఈజిప్టులోని అల్ అరిష్ అంతర్జాతీయ విమానాశ్రయానికి తరలించారు. పాలస్తీనా ప్రజల బాధలను తగ్గించడానికి, గాజాలోని అరోగ్య రంగానికి మద్దతుగా నిలిచేందుకు యూఏఈ డ్రైవ్‌కు అనుగుణంగా ఫీల్డ్ హాస్పిటల్స్ను నిర్వహించడానికి అవసరమైన పరికరాలు, సామాగ్రిని తీసుకొని ఐదు విమానాలు మంగళవారం అల్-అరిష్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నాయి.

## ఇండోనేషియాలో మరోసారి భూకంపం..

### - రిక్టర్ స్కేల్‌పై 6.9గా నమోదు..



ఇండోనేషియాను మరోసారి భూకంపం వణికించింది. ఆగ్నేయ ఆసియా ద్వీప దేశమైన ఇండోనేషియాలో భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.9గా నమోదు అయింది. ప్రాణనష్టం లేదా నష్టం ఎలాంటి సమాచారం లేదు. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ ప్రకారం, ఇండోనేషియాలోని బాండా సముద్ర ప్రాంతంలో ఈరోజు నవంబర్ 8 ఉదయం 10.23 గంటలకు 6.9 తీవ్రతతో భూకంపం సంభవించింది. యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే ప్రకారం ఎటువంటి సునామీ హెచ్చరికలు జారీ చేయలేదు. అయితే ఎంత మంది చనిపోయారు ? ఎంత మంది గాయపడ్డారు ? అనే వివరాలు తెలియరాలేదు. దేశంలోని బండా సముద్రంలో భూప్రకంపనలను గుర్తించామని ఇండోనేషియా నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ వెల్లడించింది. ఇండోనేషియాలోని అంబాన్ ప్రాంతానికి ఆగ్నేయ దిశలో 370 కిలోమీటర్ల దూరాన 146 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉండొచ్చని అంచనా వేసింది.

## కాల్పుల్లో సెక్యూరిటీ గార్డు మృతి..





పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ కాన్వాయ్‌పై దుండగులు దాడి చేశారు. ఆయనను హతమార్చేందుకు కాల్పులు జరిపారు. గాజాలో ఇజ్రాయెల్, హమాస్ మధ్య గత నెల రోజులుగా యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలోనే మంగళవారం పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌పై జరిగిన హత్యాయత్నం ఆ ప్రాంతంలో భయాందోళనలు సృష్టించింది. టర్కిష్ టైమ్స్ ప్రకారం వెస్ట్ బ్యాంక్‌లోని 'సన్స్ ఆఫ్ అబు జండాల్' ఇజ్రాయెల్‌పై చర్య తీసుకోవడానికి మహమూద్ అబ్బాస్‌కు 24 గంటల సమయం ఇచ్చినట్లు నివేదించబడింది. ఈ క్రమంలోనే అత ని కాన్వాయ్‌పై మంగళవారం దాడి జరిగింది. ఈ ఘోరమైన దాడి నుంచి పాలస్తీనా అధ్యక్షుడు తృట "లో తప్పించుకున్నారనే వార్తలు వచ్చాయి. అయితే ఈ ఘటనపై పాలస్తీనా దళాలు స్పందించాయి. ఈ దాడి జరిగిన ఘటన నిజం కాదని తెలిపాయి.

మరోవైపు అబ్బాస్ అంగరక్షకుల్లో ఒకరిపై కాల్పులు జరిగాయని, 'సన్స్ ఆఫ్ అబు జండాల్' అనే సంస్థ ఈ దాడికి బాధ్యత వహించిందని అక్కడి మీడియా పేర్కొంది. దాడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. అందులో అతని భద్రతా సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తితో ఘర్షణ పడుతున్నారు. సోషల్ మీడియాలో విడుదలైన వీడియోలో మహమూద్ అబ్బాస్ కార్ల ఫ్లీట్‌పై బహిరంగ కాల్పులు జరుగుతున్నాయి. అబ్బాస్ నౌకాదళంలో ఒక అంగరక్షకుడు అకస్మాత్తుగా కాల్చి పడిపోయినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. దీని తర్వాత మిగిలిన అంగరక్షకులు దాడి చేసిన వారితో పోరాడుతూ కనిపించారు.

కాగా.. ఈ ఘటన జరిగిన రోజే అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్ ను సందర్శించారు. గాజా సంఘర్షణ అనంతర భవిష్యత్తులో పాలస్తీనియన్లు ఒక గొంతుకను కలిగి ఉండాలని ఆయన నొక్కిచెప్పారు. గాజా పౌర జనాభాకు సహాయం చేయడానికి బైడెన్ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని అధ్యక్షుడు అబ్బాస్ కు హామీ ఇచ్చారు. అయితే బ్లింకెన్ పర్యటిస్తున్న రోజున గాజాలోని రెండు శరణార్థుల శిబిరాలపై ఇజ్రాయెల్ విమానాలు బాంబుల వర్షం కురిపించడంతో 53 మంది మరణించారు.

ప్రస్తుతం గాజా స్ట్రిప్‌లో జరుగుతున్న ఇజ్రాయెల్ దాడులను ఆపాలని చాలా దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. అదే సమయంలో కొన్ని ఇస్లామిక్ సంస్థలు, ఉగ్రవాదులు ఈ యుద్ధం ద్వారా తమ ప్రయోజనాలను కొనసాగించడంలో బిజీగా ఉన్నారు. అటువంటి సంస్థ - సన్స్ ఆఫ్ అబూ జండాల్ (అబు జండాల్ కుమారులు) సోమవారం పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌ను ఇజ్రాయెల్‌పై పూర్తి యుద్ధం ప్రకటించాలని కోరారు. గంట సమయం ఇచ్చారు. ఈ బెదిరింపు తర్వాత, అధ్యక్షుడు అబ్బాస్‌ను హత్య చేయడానికి ప్రయత్నించినట్లు ఆరోపించిన వీడియో మంగళవారం బయటపడింది. ఉగ్రవాదుల డిమాండ్లు నెరవేరిన తర్వాతే అబ్బాస్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది.

## బ్రిటన్‌లో లాఫింగ్ గ్యాస్ వినియోగంపై నిషేధం





లాఫింగ్ గ్యాస్ అని పిలువబడే నైట్రస్ ఆక్సైడ్ వినోద కార్యకలాపాల్లో వినియోగించడంపై బుధవారం నుంచి బ్రిటన్‌లో నిషేధించారు. ఆరోగ్య సంరక్షణ, ఇతర పరిశ్రమలకు దీని నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ డ్రగ్‌ను ఉత్పత్తి చేయడం లేదా సరఫరా చేయడం లేదా విక్రయించడం వంటి కార్యకలాపాల్లో పట్టుబడిన వ్యక్తులు జైలు శిక్షను ఎదుర్కొంటారని అధికారులు స్పష్టం చేశారు.

తాజా సమాచారం ప్రకారం ఈ నేరం చేసిన వారికి రెండేళ్ల జైలు శిక్ష విధించబడుతుందని ప్రకటించారు. దీంతోపాటు నైట్రస్ ఆక్సైడ్‌ను సరఫరా చేస్తే 14 సంవత్సరాల వరకు కటకటాల పాలవుతారని వెల్లడించారు. ఇటీవల కాలంలో బ్రిటన్లో నైట్రస్ ఆక్సైడ్ దుర్వినియోగం ఎక్కువగా చేస్తున్నారు. దీంతోపాటు ఇది ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రమాదకరమని వైద్యులు తేల్చారు. ఇలాంటి క్రమంలో దీనిని వినియోగించడం మానాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇంగ్లాండ్‌లో 16 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు గలవారిలో నైట్రస్ ఆక్సైడ్ వినియోగం మూడో స్థానంలో ఉంది. అంతేకాదు దీనిని సంఘవిద్రోహ ఘటనలకు కూడా ఉపయోగిస్తున్నారని తేలింది.

ఈ నైట్రస్ ఆక్సైడ్ 'క్లాస్ సి' డ్రగ్‌గా సూచించబడుతుంది. బ్రిటన్ చట్టాల ప్రకారం అనాబాలిక్ స్టెరాయిడ్స్, బెంజోడియాజిపైన్స్, గ్రోత్ హార్మోన్లతో పాటుగా "అత్యల్ప హానికరమైన" మందుల విభాగంలో వర్గీకరించబడుతుంది. దీనిని అధికంగా వాడటం వలన రక్తహీనత సహా మరికొనని తీవ్రమైన సందర్భాల్లో నరాల బలహీనత లేదా పక్షవాతం కూడా వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

# కిలారు రాజేష్ హత్యకి కుట్ర ?



ఫేక్ నెంబర్ ప్లేట్లతో నిన్న హైదరాబాద్ లో
రాజేష్ ని వెంబడించిన దుండగులు..

---

తమ నాయకుడు చెప్పింది వినకపోతే
ఏమి జరుగుతుందో చూస్తావు
అంటూ బెదిరింపులు..



---

వెంబడించిన దుండగులని
అరెస్టు చేసి ప్రాణ రక్షణ
కల్పించాలంటూ ఫిర్యాదు
చేసిన రాజేష్.



---

కేసు నమోదు చేసి విచారిస్తున్న
జూబ్లీ హిల్స్ పోలీసులు.